

క్రిస్ సిటీ రేఖాచిత్రం

క్రిస్ సిటీతో జిల్లా రూపురేఖల మార్పు

- విశాఖ నుంచి ప్రధాని శంకుస్థాపన
- మూడు దశలుగా ప్రాజెక్టు అమలు
- 2500 ఎకరాల్లో రూ. 2139 కోట్లతో తొలిదశ పనులు
- 2027 ఫిబ్రవరి నాటికి ఫేజ్-1 పూర్తి చేయాలని లక్ష్యం
- రూ. 7500 కోట్ల పెట్టుబడులు, 50 వేల ఉద్యోగాలు వస్తాయని అంచనా
- రూ. 1173 కోట్ల పనులకు టెండర్లు పూర్తయి నిర్మాణాల ప్రారంభం



క్రిస్‌సిటీ ప్రాంతంలో జరుగుతున్న పనులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖపట్టణం నుంచి శంకుస్థాపన చేసిన క్రిస్ సిటీ ప్రాజెక్టు ఉమ్మడి జిల్లా రూపురేఖలు మార్చనున్నది.సీఎం నారా చంద్రబాబు నాయుడుతో కలసి ప్రధాని ఈ పారిశ్రామిక నగరికి శ్రీకారం చుట్టడం జిల్లా చరిత్రలో మైలు రాయిగా నిలిచిపోనుంది. మొత్తం మూడు దశలుగా చేపట్టనున్న క్రిస్ సిటీ నిర్మాణం పూర్తయితే రూ. 37,500 కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా 4.67 లక్షల మందికి ఉద్యోగావకాశాలను కల్పించనుంది. ప్రస్తుతానికి తొలి దశ కింద రూ. 2139 కోట్లతో 2500 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవస రమైన మౌలిక సదుపాయాలు కల్పించే పనులు మొదలయ్యాయి. రానున్న రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

తొలిదశ పనులకు కేంద్రం ఆమోదం

గత కొన్నేళ్లుగా ప్రతిపాదనలు, ప్రణాళికల రూపంలో మగ్గుతూ వచ్చిన క్రిస్ సిటీ ప్రాజెక్టు పనులకు ఇపుడు యుద్ధప్రాతిపదికన అనుమతులు లభించడం విశేషం. ప్రధాని మోదీ విశాఖ నుంచి బుధవారం శంకుస్థాపన చేసే కార్యక్రమం ఖరారు కావడంతోనే ఈ ప్రాజెక్టు ఫైళ్లు వేగంగా క్లియర్ అయ్యాయి. గత నెల 30న ఢిల్లీలో అత్యవసరంగా సమావేశమైన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ జిల్లాకు సంబంధించిన చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన క్రిస్ సిటీ (కృష్ణపట్నం నోడ్) తొలి దశ పనులకు ఆమోదం తెలిసింది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, కోట మండలం కొత్తపట్నం, శిద్ధవరం గ్రామాల పరిధిలో 2500 ఎకరాలలో రూ. 2139.43 కోట్లతో అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పన పనులకు అనుమతినిచ్చింది.

రూ. 1173 కోట్లతో తొలి దశ పనులు

క్రిస్ సిటీలో తొలి దశ మౌళిక సదుపాయాల కల్పన కింద రోడ్ నెట్‌వర్క్, వాటర్ సప్లై నెట్‌వర్క్, రీ యూజ్ వాటర్ నెట్‌వర్క్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్,

మిగతా 6వ పేజీలో

జిల్లాలో కమలనాథుడెవరు ?

- పోటీలో ముగ్గురున్నా వంశీధర్‌కే అవకాశం
- రేపు ప్రకటించే అవకాశం

నెల్లూరు(క్రైం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎవరు...? అనే చర్చ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో సాగుతుంది. నిబంధనల ప్రకారం జిల్లా అధ్యక్ష పదవి కాలపరిమితి మూడేళ్లు. 2012కి ముందు రెండేళ్లే ఉండేది. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి 17 నెలలు మాత్రమే అయింది. బీజేపీలో ఆరేళ్లకొకసారి సభ్యత్వ నమోదు జరుగుతుంది. ఈ క్రమంలో ఇటీవలే దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు ముగిసింది. ఈ క్రమంలో బూత్ అధ్యక్షుడి నుంచి జాతీయ అధ్యక్షుడి వరకు మార్పు జరగనున్నది. ఇందులోభాగంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై ఈనెల 4న రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, జిల్లా ఎన్నికల అధికారి సామంచి శ్రీనివాస్ అభిప్రాయ సేకరణ చేశారు. కొత్తగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షులు, మండలస్థాయి ప్రతినిధులు, కోర్ కమిటీ సభ్యులతో కలిపి మొత్తం 69 మందితో విడివిడిగా అభిప్రాయాలు తీసుకున్నారు. ఆ నివేదికను రాష్ట్రశాఖకు అందజేశారు. అంతేకాక జిల్లా అధ్యక్ష పదవికి కూడా దరఖాస్తులు స్వీకరించారు.

వంశీధర్‌కే అవకాశం ?

అధ్యక్ష పదవి రేసులో ఉన్న శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, గుండ్లపల్లి భరత్‌కుమార్, బైరి శ్రీనివాస్‌ల మధ్యే పోటీ ఉన్నట్లు సమాచారం. ప్రధాని మోదీ విశాఖ పర్యటన పూర్తవడంతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల జాబితాను శుక్రవారం విడుదల చేసే అవకాశం ఉంది. గురువారం(నేడు) రాత్రి జిల్లా అధ్యక్షుడి ఎంపికపై స్పష్టత వస్తుందని నేతలు చర్చించుకుంటున్నారు. అయితే మరోసారి జిల్లా అధ్యక్ష పదవి శీపారెడ్డి వంశీధర్‌రెడ్డికే దక్కుతుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.



11 మంది దరఖాస్తు

జిల్లా అధ్యక్ష పదవికి 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ప్రస్తుత జిల్లా అధ్య క్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, రాష్ట్ర విపత్తులశాఖ కన్వీనర్ మండ్ల ఈశ్వరయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘునాథ రాజు, కోవూరు అసెంబ్లీ కన్వీనర్ ఇండ్ల రాఘవేంద్ర, జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డం విజయకుమార్, జిల్లా కార్యదర్శి పరుశు రామ్, నాయకులు సమాధి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు పీవీ నారాయణ రెడ్డి ఉన్నారు.

ఉత్తరద్వార దర్శనం.. మోక్ష మార్గం

- రేపు ముక్కోటి ఏకాదశి
- వైష్ణవాలయాల్లో భారీగా ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం)/ ఆత్మకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాక్షసుల బాధలు భరించలేక దేవతలు, ప్రజలు వైకుంఠంలోని విష్ణుమూర్తిని ఉత్తరద్వారం ద్వారా దర్శించుకుని తమ బాధలు తెలియజేస్తారు. దుష్టశిక్షణ కోసం విష్ణుమూర్తి గరుడ వాహనంపై భువికి దిగివస్తారు. అలా వచ్చినరోజే ముక్కోటిగా జరుపుకుంటారు. ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకుంటే స్వర్గానికి తలుపులు తెరిచి ఉంటాయని భక్తుల విశ్వాసం. తెలుగు నెలలు చైత్రం నుంచి పాల్గుణం వరకు 12 నెలల్లో మొత్తం 24 ఏకాదశిలు వస్తాయి. వీటిలో సూర్యగమనం ప్రకారం ధనుర్మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి వ్యవహరిస్తారు.



ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి ఘడియలు ఈనెల 9 మధ్యాహ్నం 12.22 గంటలకు ప్రారంభమై 10వతేదీ ఉదయం 10.19గంటల వరకు ఉంటాయి. సూర్యోదయ తిథి కారణంగా దేశ వ్యాప్తంగా 10వ తేదీన ముక్కోటిని జరుపుకుంటారు. ఆ రోజున ఉపవాస దీక్షలు తీసుకొని, మరుసటి రోజు దీక్ష విరమిస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి వైష్ణవాలయాల్లో వైకుంఠ ద్వారదర్శనం కల్పించనున్నారు. ఇందుకుగాను ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.కాగా ఆత్మకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీదేవి భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయాలు ముక్కోటికి సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. శుక్రవారం వేకువజాము నుంచే ఉత్తరద్వార దర్శ నానికి ఏర్పాటు చేశారు. ఉదయగిరిలోని సుద్దబావి వీధిలో ఉన్న శ్రీసీతారాముల ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరింది.

క్యారమ్స్ ఛాంపియన్లు జనార్దన్, పూజ

- సీడెడ్ ఆటగాళ్లపై జూనియర్లదే పైచేయి
- ముగిసిన ఆలిండియా పోటీలు



ట్రోఫీలతో పురుషుల సింగిల్స్ విజేతలు



ట్రోఫీలతో మహిళల సింగిల్స్ విజేతలు

నెల్లూరు(విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నెల్లూరు క్లబ్‌లో నిర్వహించిన 29వ ఆలిండియా ఫెడరేషన్ క్యారమ్స్ కప్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన జనార్దన్‌రెడ్డి, పుదుచ్చేరికి చెందిన పూజ ఛాంపియన్‌లుగా నిలిచారు. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో సీడెడ్ ఆటగాళ్లు జూనియర్‌ల చేతిలో ఘోర పరాజయం చెందారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ కె.శ్రీనివాస్ (పీఎస్‌పీబీ) జైన్ ఇరిగేషన్‌కు చెందిన సందీప్‌దైవ్ చేతిలో ఓడిపోగా, మరో ప్రపంచ ఛాంపియన్ వి.ఖాజీమా (పిఎస్‌పిబీ) యూపీకి చెందిన మంటషాఇక్బాల్ చేతిలో ఓటమి చెందారు. మెన్స్ సింగిల్స్ విభాగంలో ఆంధ్రా క్రీడాకారుడు జనార్దన్‌రెడ్డి ఆర్‌బీఐకు చెందిన టాప్ సీడ్ ఆటగాడు ప్రశాంత్‌పై సెమీస్‌లో విజయం సాధించడంతో పాటు ఫైనల్స్‌లో జైన్‌ఇరిగేష్‌కు చెందిన క్రీడాకారుడు సందీప్ దైవ్‌పై రెండు సెట్‌లలో ఓడించి పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 70 ఏళ్ల అనంతరం ఏపీకి చెందిన తెలుగు క్రీడాకారుడు ఆలిండియా ఛాంపియన్ షిప్‌ను దక్కించుకోవడంతో క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. మహిళల సింగిల్స్‌లో పుదుచ్చేరికి చెందిన 14 ఏళ్ల జూనియర్ క్రీడాకారిణి వి.పూజ పీఎస్‌పీబీకి చెందిన మాజీ జాతీయ ఛాంపియన్ ఇలవజిపై ఫైనల్‌లో వరుసగా రెండు సెట్‌లలో గెలిచి తన తొలి మహిళల సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకుంది.

విజేతలు వీరే..

ఫైనల్స్‌లో పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. పురుషుల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీహెచ్.జనార్దన్‌రెడ్డి ప్రథమస్థానంతో ఛాంపియన్‌గా నిలవగా జైన్ ఇరిగేషన్‌కు చెందిన బీటీ.సందీప్ ద్వితీయస్థానంలో నిలిచారు. కె.శ్రీనివాస్(పీఎస్‌పీబీ) తృతీయస్థానం, ప్రశాంత్‌మోర్(ఆర్‌బీఐ) నాలుగవస్థానం సాధించారు. మహిళల సింగిల్స్‌లో పుదుచ్చేరికి చెందిన వి.పూజ జాతీయ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించగా తమిళనాడుకు చెందిన ఇలవజి ద్వితీయస్థానంలో నిలిచారు. పీఎస్‌పీబీకు చెందిన కాజల్‌కుమారి తృతీయస్థానం, వి.మిత్ర నాలుగవస్థానం దక్కించుకున్నారు. డబుల్స్ మహిళల విభాగంలో పీఎస్‌పీబీకి చెందిన ఖాజీమా-వి.మిత్రలు ప్రథమస్థానం, మహారాష్ట్రకు చెందిన

మిగతా 6వ పేజీలో

కార్యకర్తలకే పెద్ద పీట

- వారిని కష్టపెట్టినవారు సెల్యూట్ అనేలా చేస్తా..
- జడ్పీటీసీ, ఎంపీపీల సమావేశంలో జగన్



నెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటివరకు జరిగింది మరచిపోండి, భవిష్యత్తులో అన్నీ విషయాల్లోనూ కార్యకర్తలకే పెద్దపీట వేస్తా'... అని వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా ద్వితీయశ్రేణి నాయకులకు భరోసా ఇచ్చారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా పరిధిలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగింది మరిచిపోండి, ఇక భవిష్యత్తులో అన్నీ విషయాల్లోనూ కార్యకర్తలకే పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చారు. మిమ్మల్ని ఇబ్బందులు పెట్టినవారి పేర్లు రాసిపెట్టుకోండి, రెడ్‌బుక్ అక్కర్లేదు.. మీ దగ్గరున్న పుస్తకంలో రాసి పెట్టుకోండి.. మనం మళ్లీ అధికారంలోకి వచ్చాక వారి చేత మీకు సెల్యూట్ కొట్టిస్తాను.. అని జగన్ అన్నారు. రాజకీయ పదవుల్లో కానీ, అభివృద్ధి పనుల విషయంలో కానీ కార్యకర్తలకే అగ్రతాంబూలమని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ మేరిగ మురళి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అనీల్‌కుమార్ యాదవ్, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఉదయగిరి, వెంకటగిరి ఇన్‌చార్జులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నియోజకవర్గాల వారీగా నేతలతో జగన్ కొంత సేపు ముచ్చటించారు.





సమావేశానికి హాజరైన కూటమి నాయకులు, కార్యకర్తలు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న వీపీఆర్

తాము ఈ స్థాయిలో ఉన్నామంటే అది మీ కష్టమే : ఎంపీ వేమిరెడ్డి

వింజమూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తాను ఎంపీగా, కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా ఉన్నామంటే.. అది నాయకులు, కార్యకర్తల కష్టమేనని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వింజమూరు ఎస్వీ కల్యాణ మండపం ఆవరణలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన ఉదయగిరి నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ప్రచారానికి వారం రోజులు మాత్రమే వచ్చానని, కూటమి నాయకులు, కార్యకర్తలు తన గెలుపు కోసం 45 రోజులపాటు రేయింబవళ్లు కష్టపడ్డారన్నారు. తనకు 7.66 లక్షల ఓట్ల మెజార్టీ వస్తే 98 వేల ఓట్లు ఈ నియోజకవర్గంలోనే వచ్చాయన్నారు. బీపీసీఎల్ ఏర్పాటుతో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోపాటు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ మా ఇద్దరికి కష్టం విలువ తెలుసన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు, పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపడతానన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రజలను రాక్షస పాలన నుంచి కాపాడిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. అనంతరం సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు మాట్లాడారు. అనంతరం నేతలను కూటమి నేతలు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు, నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎందుకంత ఉదాసీనత

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెతలా మారింది జిల్లాలోని రైతాంగం పరిస్థితి. సాగునీటి కాలువలను బాగు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా వాటిని పంపడంలో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వేగంగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరుతుంటే జిల్లాలో మాత్రం ఇంతవరకూ ఆ ఊసేలేదు. మొదటి పంట సమయంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవాల్సిందిపోయి మళ్లీ అదేబాటలో నడుస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- రెండో పంట విషయంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం
- ఓఅండ్ఎంకు ప్రతిపాదనలు పంపాలన్న ప్రభుత్వం
- రోజులు గడుస్తున్నా సిద్ధం కాని వైనం



నెల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో మూడేళ్ల పాటు కాలువల నిర్వహణను గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని సూచించింది. దీంతో జిల్లా నుంచి రికార్డు స్థాయిలో రూ.100 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు చూసిన రాష్ట్రస్థాయి అధికారులు కూడా ఆశ్చర్యపోయారు. ఇందుకు గల కారణాలను జిల్లా అధికారులు వివరించినా ఓఅండ్ఎం హెడ్ కింద నిధులు లేక అంతస్థాయిలో అనుమతులు ఇవ్వలేకపోయారు. ఆ రూ.100 కోట్లను రూ.40 కోట్లకు తగ్గించి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ఉన్నతాధికారులు సూచించారు. ఆవిధంగానే ప్రతిపాదనలు కుదించి అత్యవసర వర్కులను మాత్రమే పెట్టారు.

రూ.30 కోట్లతో అనుమతులు

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ హెడ్ కింద ప్రభుత్వం మొదటి పంట సమయంలో కాలువల మరమ్మతులకు రూ.30 కోట్లతో అనుమతులు మంజూరు చేసింది. అయితే మొదటి పంట సమయంలో మిగిలిపోయిన పలు అత్యవసర పనులను ఇప్పుడు చేపట్టాల్సి ఉంది. కొన్ని కాలువల్లో పూడిక తీయడమే కాకుండా షట్టర్లు, తూములు కూడా బాగు చేయాల్సి ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే రెండో పంట సమయంలో అవసరమైన ఓఅండ్ఎం ప్రతిపా దనలు పంపాలని గత నెలలోనే ఈఎన్‌సీ లేఖ రాశారు. కానీ జిల్లా అధికారులు మాత్రం ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒకటీ రెండు సబ్ డివిజన్లు మినహా మిగిలిన సబ్ డివిజన్లలో ప్రతిపాదనల తయారీ పూర్తి కాలేదు. క్షేత్రస్థాయిలో కాలువ లను ఎప్పుడు పరిశీలించాలి ? ప్రతిపాద నలు ఎప్పుడు తయారు చేయాలి? వాటిని జిల్లాస్థా యిలో ఆమోదించి ఇంకెప్పుడు ప్రభుత్వానికి పంపాలి ? అన్న ప్రశ్నలు రైతాంగంలో తలెత్తు తున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది నెమ్మదిగా కదులుతుండగా, వారిని పరిగెత్తించడంలో ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

ఆలస్యంతో అనర్థం

అవకాశం వచ్చినప్పుడే అందిపుచ్చుకోవాలి. లేదంటే అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అనుభవజ్ఞులు చెబుతుంటారు. మొదటి పంట సమయంలో ఇరిగేషన్ శాఖలో కూడా ఇదే జరిగింది. ఓఅండ్ఎం పనులు ప్రతిపాదించే సమయంలోనే లస్కర్లను కూడా నియమించుకునేందుకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు అన్ని జిల్లాల నుంచి ప్రతిపాదనలు వెళ్లగా, అన్నిచోట్ల లస్కర్లను నియమకానికి అనుమతులు లభించాయి. ఆఖరుకు జిల్లా పరిధిలో తెలుగు గంగ ప్రాజెక్టు పరిధిలో కూడా లస్కర్ల నియామకానికి అనుమతులొచ్చాయి. కానీ డెల్టా ప్రాంతంలో మాత్రం ఇప్పటికీ అనుమతులు రాలేదు. అందుకు ప్రధాన కారణం ఇరిగేషన్ అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపకపోవడమే. రెండేళ్ల నుంచి లస్కర్లు లేక నీటి యాజమాన్యం గందరగోళంగా మారి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది మాదిరిగానే ఇప్పుడు కూడా లస్కర్లు లేకుండానే సాగు జరుగుతోంది. ఈ సీజన్‌లోనైనా త్వరగా ప్రతిపాదనలు పంపితే కేటాయింపుల్లో కోత లేకుండా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రతిభ చూపాలి

● నెల్లూరు మేయర్ స్రవంతి



యువ ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ప్రతిభ చూపాలని నెల్లూరు నగర మేయర్ స్రవంతి పిలుపునిచ్చారు. నెల్లూరు టౌన్ హాలులో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో బుధ వారం జరిగిన యువజన్ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. యువతలోని ప్రతిభా పాటవాలను వెలికితీ యడం, వారి నైపుణ్యాలను మరింత ఉన్నతంగా తీర్చిది ద్దాలన్నదే ఉత్సవ్ ముఖ్య ఉద్దేశ మన్నారు. దేశ ఔన్నత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన స్వామి వివేకా నందను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య, ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజహితం కోసం, దేశంకోసం కృషి చేయాలని కోరారు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంపై ఆసక్తి పెంచుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు తిలకించి యువతను అభినందించారు. వ్యవ సాయంలో సైన్స్ టెక్నాలజీ, ప్లాస్టిక్‌ను అరిక డుతూ జూట్ బ్యాగుల వినియోగం, సేంద్రీయ ఉత్పత్తుల స్టాల్స్, మొబైల్ ఫొటోగ్రఫీ, యువ రచయితల పోటీ, డ్రాయింగ్, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో యువజన అధికారి మహేంద్ర రెడ్డి, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధి కారి సత్యవాణి, ఎంఈవో హమీద్, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

హెల్మెట్ ధరిస్తేనే ప్రవేశం

● పోలీసు కార్యాలయంలో కొత్త నిబంధన ● ప్రజాచైతన్యం కోసమే...

నెల్లూరు(క్రైం), జనవరి8 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వినియోగంపై జిల్లా పోలీసు శాఖ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. పోలీసు అధికారులు అందరూ కలిసి నెల్లూరులో ఇటీవల హెల్మెట్ వినియోగంపై భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోకి ద్విచక్ర వాహనంపై వచ్చే వారు ఎవరైనా సరే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే అన్న నిబంధన తీసుకువచ్చారు. దీంతో అధికారుల నుంచి సిబ్బంది వరకు అందరూ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించే వెళుతున్నారు. ఈ నిబంధన పాటించని వారిని గేటు వద్దే ఆపేస్తున్నారు. వారి వాహనాలు బయట పెట్టించి నడుచుకుంటూ లోపలికి వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ నిబంధన పోలీసులకే కాదు, కార్యాలయానికి వచ్చే విలేకర్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, సాధారణ ప్రజలకు కూడా వర్తింపజేసేలా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎస్పీ కార్యాలయానికి వెళ్లాలనుకునే వారంతా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అయింది.

పోలీసులు ఆదర్శంగా నిలవాలి : కృష్ణకాంత్, ఎస్పీ

హెల్మెట్ వినియోగంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన దారులకు అవగాహన కల్పిస్తున్నాము. ముందుగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు ఆదర్శంగా నిలిచేలా హెల్మెట్ ధరించాలి. జిల్లా కార్యాలయం లోపలికి వచ్చే ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆదేశించాం. దీంతో కార్యాలయానికి వచ్చే వారిలో మార్పు వచ్చింది. ప్రజలు కూడా ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం శ్రేయస్కరం.



జాతీయ సైన్స్ ఫెయిర్‌కు జిల్లా ప్రాజెక్టు ఎంపిక

● రాష్ట్రస్థాయిలో 'త్రికోణమితి'కి ప్రశంసలు



జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్

నెల్లూరు(విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రద ర్శించిన ప్రాజెక్టులలో జిల్లాలోని టీపీగూడూరు మండలం కోడూ రు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపి కైంది. ఆ పాఠ శాల విద్యార్థినులు బీ కీర్తి, డీ రాజశ్రీ ప్రదర్శించిన నిత్యజీవి తంలో త్రికోణమితీయ అనువర్త నాలు అనే ప్రాజెక్టును జాతీయ సదరన్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా సదరు విద్యా ర్థినులను, వారికి మార్గదర్శకం వహించిన ఉపాధ్యాయురాలు సీహెచ్ కామాక్ష మ్మను జిల్లా సైన్స్ అధికారి డీ కరుణాకర్‌రెడ్డి అభి నందించారు. ఈ నెల 20 నుంచి 25వతేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయ సైన్స్ ఫెయిర్‌లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు

● ప్రభుత్వ భూముల్లో లేఅవుట్ల స్వాధీనం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నుడా పరిధిలో అక్రమ లేఅవుట్లపై కఠినంగా వ్యవహరిస్తామని, ఎవరినీ ఉపేక్షించేది ఉండదని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. నుడా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 200కుపైగా అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ లేఅవుట్లపై చర్యలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండ దండలతో ఇష్టానుసరంగా అక్రమ లేఅవుట్లు వేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను సైతం వదల కుండా అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేశారని విమర్శించారు. ఆ భూముల న్నింటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అక్రమ లేఅవుట్లు వేయాలంటేనే భయపడేలా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎంబీజీ లేఅవుట్లతో నుడాకు ఆర్థిక వనరులను సమకూర్చేం దుకు కసరత్తు జరుగుతోందన్నారు.

● రెడ్‌క్రాస్‌లో అవినీతిపై విచారణ జరిపిస్తాం

రెడ్‌క్రాస్‌లో అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మంత్రి నారాయణపై విమర్శలు చేయడం సిగ్గుచేటని నుడా చైర్మన్ అన్నారు. రెడ్‌క్రాస్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు. ఈ సమావేశంలో నుడా పట్టణ ప్రణాళిక అధికారి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న దేహదారుఢ్య పరీక్షలు

● ఇప్పటివరకు గైర్హాజరైన వారికి మరో అవకాశం

నెల్లూరు(క్రైం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాని స్టేబుల్ ఉద్యోగ నియామ కాలకు సంబంధించి నెల్లూ రులోని పోలీసు కవాతు మైదానంలో అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు గురువారంతో ముగియనున్నాయి. డిసెంబరు 30వ నుంచి ఈ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు పరీక్షలకు గైర్హాజరైన అభ్యర్థులు చివరి రోజు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. కాగా, బుధవారం జరిగిన ఫిజికల్ టెస్ట్‌కు 600 మంది అభ్యర్థులకుగాను 554 మంది హాజర య్యారు. వారిలో 482 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఎస్పీ జీ కృష్ణకాంత్ ఈ పరీక్షలను పర్యవేక్షించారు.

మున్సిపల్ కమిషనర్ల సీనియారిటీ జాబితా

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.



దివ్యాంగులకు విద్యుత్ ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ తదితరులు

దివ్యాంగుల అభ్యున్నతే వీపీఆర్ ఫౌండేషన్ ధ్యేయం

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ● 145 మంది దివ్యాంగులకు విద్యుత్ ట్రైసైకిళ్ల పంపిణీ

వింజమూరు/ఉదయగిరి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభ్యున్నతే ధ్యేయంగా వీపీఆర్ ఫౌండేషన్ పనిచేస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం వింజమూరు పట్టణంలోని ఎస్వీ కల్యాణ మండపం ఆవరణలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, విశిష్ట అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్‌తో కలిసి నియోజకవర్గంలోని 145 మంది దివ్యాంగులకు విద్యుత్ ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల క్రితం వీపీఆర్ ఫౌండేషన్ ఏర్పాటుచేసి రాజకీయాలతో సంబంధం లేకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 150 శుద్ధిజల కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికంగా దివ్యాంగులను గుర్తించామని, అందుకే వారికి తొలుత విద్యుత్ ట్రైసైకిళ్లు అందజేశామన్నారు. అలాగే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని దివ్యాంగులందరికీ ట్రైసైకిళ్లు అందజేస్తామన్నారు. ట్రైసైకిళ్లు మరమ్మతులకు గురైతే వాటిని బాగుచేసేందుకు ప్రత్యేక వ్యవస్థను సైతం నియమించామన్నారు. త్వరలో దివ్యాంగులకు రుణాలు సైతం ఇప్పించి ఆదుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ సమాజ అవసరాలకనుగుణంగా విస్తృతమైన సేవలు అందిస్తోందని, వారికి జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఆర్‌సీ ద్వారా దివ్యాంగులకు మండలస్థాయిలో సేవలందిం చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ సేవలు మరువలేనివని, అడిగిన వెంటనే నియోజకవర్గానికి 34 ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినందుకు ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ కోట్ల రూపాయలు ఆస్తులున్నా సహాయం చేసే గుణం కొందరికే ఉంటుందని, అలాంటి వారిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డన్నారు. మంచి నాయకులను ఎంచుకుంటే మంచి పాలన అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్యారమ్స్ ఛాంపియన్లు జనార్దన్, పూజ

(5వ పేజీ తరువాయి)

బి.శోభిఖ-ఎస్.ప్రీతిప్రిన్సిలు ద్వితీయ స్థానం సాధించారు. పీఎస్‌పీబీకి చెందిన రష్మీకుమా రి-ఇలవజిలు తృతీయస్థానం, సీసీఎస్‌సీఎస్ బీకి చెందిన కె.నాగజ్యోతి -నీలంగోదాఖేలు నాలుగవస్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో ఆర్‌బీఐకు చెందిన జహీర్‌పా షా-ప్రశాంత్ మోర్‌లు ప్రథమస్థానం, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్ ధారియా-పంకజ్ అశోక్‌లు ద్వితీయస్థానంలో నిలిచారు. జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీం కరీంఖాన్-అభిజిత్ త్రిపాంకర్ తృతీయస్థానం, సందీప్ డైవ్-జైద్ అహ్మద్ ఫారూఖీ నాలుగవస్థానం సాధించారు. విజేతలకు అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్‌మేయర్ (స్విట్జర్లాండ్), అంతర్జాతీయ క్యారమ్ ఫెడరే షన్ ప్రధాన కార్యదర్శి వీడీ .నారాయణ, అఖిలభారత క్యారమ్స్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి, ప్రధాన కార్యదర్శి భారతి నారాయణ్‌లు. తెలంగాణా రాష్ట్రం నకిరికేల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.అబ్దుల్‌జలీల్, ఫెడరేషన్ కప్ కో చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరుక్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్.శ్రీమన్నారాయణ, కార్యదర్శి వీ.రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, క్లబ్ కోశాధికారి విశ్వనాథ్ పాల్గొన్నారు.



బహుమతులతో పురుషుల డబుల్స్ విజేతలు



బహుమతులతో మహిళల డబుల్స్ విజేతలు

గర్వపడుతున్నా

చిన్నతనం నుంచి క్యారమ్స్‌పై ఉన్న మక్కువతో కష్టపడుతూనే వివిధ స్థాయిల్లో ఇప్పటి వరకు 17 సార్లు రాష్ట్ర పతకాలు సాధించా. తొలిసారిగా ఆలిండియా పోటీల్లో ఛాంపియన్‌గా నిలవడం గర్వంగా ఉంది. భవిష్యత్‌లో ప్రపంచ వేదికపై భారత పతాకాన్ని రెపరెపలాడించడమే ధ్యేయంగా మరింత సాధన చేస్తా.

- సీహెచ్.జనార్దన్‌రెడ్డి, ఆలిండియా పురుషుల ఛాంపియన్

ఛాంపియన్‌షిప్ దక్కడం ఆనందంగా ఉంది

అతిచిన్న వయసులో ఆలిండియా ఛాంపియన్‌షిప్ దక్కడం ఆనందంగా ఉంది. పదోతరగతి చదువుతున్న నేను సీనియర్స్ విభాగంలో పోటీ పడ్డా. అందరికీ గట్టిపోటీనిచ్చి విజేతగా రికార్డు సాధించడం సంతోషాన్నిస్తోంది. ఇదే స్ఫూర్తితో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌పై దృష్టి సారిస్తాను.

- పూజ, ఆలిండియా మహిళా ఛాంపియన్

క్రిస్ సిటీతో జిల్లా రూపురేఖల మార్పు

(5వ పేజీ తరువాయి)

కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 132-33 కేవీ సబ్ స్టేషన్, 33-11 కేవీ ఇంటర్నల్ సబ్ స్టేషన్లు వంటివి నిర్మించనున్నారు. మొత్తం అంచనా వ్యయం రూ. 2139 కోట్లు కాగా అందులో రూ. 1173 కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అందులో భాగంగా రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాల పనులు మొదలయ్యాయి.

● రెండేళ్లలో రూ.7,500 కోట్ల పెట్టుబడులు... 50 వేల ఉద్యోగాలు

తొలి దశ పనులు 2027 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ఫేజ్ -1 పనులు పూర్తయితే వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా క్రిస్ సిటీకి రూ. 7500 కోట్ల పెట్టుబడులు వస్తాయని కేంద్ర, రాష్ట్రాలు అంచనా వేస్తున్నాయి. తద్వారా ఈ ప్రాంతంలో 50 వేల మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నాయి.

● పూర్తయితే అభివృద్ధికి మేలిమలుపు

కృష్ణపట్నం పోర్టును, చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌ను అనుసంధానం చేస్తూ జిల్లాలోని చిల్లకూరు, కోట మండలాల్లో మూడు దశలుగా ఏర్పాటవుతున్న క్రిస్ సిటీ పూర్తయితే జిల్లా అభివృద్ధికి మేలి మలుపు అవుతుంది. గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, మోమిడి, వెల్లపాలెం, బల్లవోలు గ్రామాలు, అలాగే కోట మండలం కొత్తపట్నం, సిద్ధవరం, కర్లపూడి గ్రామాల నుంచీ 10,834 ఎకరాల భూములను ప్రభుత్వం సేకరిస్తోంది. మొత్తం ప్రాజెక్టు పూర్తయితే ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్ అండ్ అప్పారెల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఇంజనీరింగ్ అండ్ ఎంఎస్‌ఎంఈ, ఇతర బిల్డింగ్ మెటీరియల్స్ వంటి పరిశ్రమలు కానున్నాయి. వాటి ద్వారా రూ. 37,500 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 4,67,500 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంచనా వేస్తున్నాయి.

రెడ్‌క్రాస్ కమిటీ నిబంధనలు పాటించాలి

● కొత్త చైర్మన్‌ను ఎన్నుకోండి : కలెక్టర్



రెడ్‌క్రాస్ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం) జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ నిబంధనల ప్రకారం సభ్యులంతా పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ చాంబర్‌లో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు తటస్థంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. అయితే కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు రాష్ట్ర కమిటీకి లేఖలు వచ్చాయన్నారు. ఇప్పటికే కొంతమంది సభ్యులపై ఆధారాలతో ఫిర్యాదులు అందాయని, వారికి నోటీసులు ఇస్తామని చెప్పారు. అలాంటి వారంతా కమిటీ నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలన్నారు. మిగిలిన సభ్యులలో ఒకరిని చైర్మన్‌గా ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనపోతే 24 గంటల్లో వివరణ ఇస్తే పరిశీలిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



అల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అల్లూరుపేట పోలేరమ్మ తిరనాళ్లలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా .రిగింది. అమ్మవారు ప్రత్యేక పూలాలంకరణలో అశ్వవాహనంపై కొలువుదీరి గామోత్సవానికి తరలగా భక్తులు కరతాళ ధ్వనులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆచారానుగుణమైన గంగాపెట్ట, వీరతాళ్లతోపాటు పలు ప్రత్యేకమైన సాంస్కృతిక కార్యక్రమాలను గ్రామోత్సవంలో ఉంచి భక్తులకు ఆహ్లాదాన్ని అందించారు. అల్లూరు అల్లుడు అయిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యనిర్వాహకులు పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డిల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తజనం విశేషంగా హాజరై తమ భక్తిని చాటారు. మంగళవారం అర్ధరాత్రి తరువాత ప్రారంభమైన గ్రామోత్సవం బుధవారం సాయంత్రం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు పెన్నార్ డెల్టా ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ పర్యవేక్షించారు.

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. డీజే సౌండ్స్, తప్పెట్లు, తీన్‌మార్ బ్యాండ్, కోలాటాలు, కాంతార నృత్యాలు తదితర కార్యక్రమాలు ఆకర్షించాయి. అదేవిధంగా ట్రాలీ మ్యూజికల్ నైట్ ఈ ఏడాది ప్రత్యేకతను సంతరించుకుంది. మ్యూజికల్ నైట్‌లో జబర్దస్త్ నటులు, ప్రముఖ కళాకారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కాళీయ మర్దనుడిగా రంగనాథుడు



నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో బుధవారం కాళీయ మర్దనుడి అలంకరణలో రంగనాథస్వామి దర్శనమిచ్చారు. మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో శ్రీవారికి యోగ నరసింహస్వామి అలంకారం జరిగింది. రెండు ఆలయాల్లో ఆళ్వార్ల ఘోష్టి, దివ్య నాలాయిర ప్రబంధ ఘోష్టి గానం జరిగాయి. ఆండాళ్ అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా దొంతంశెట్టి బలరామయ్య, వెంకట నరసింహులు గుప్తా కుటుంబాలు, కొల్లూరు బాలాజీ వ్యవహరించారు.



కుష్టువ్యాధి రహిత జిల్లాగా మార్చాలి

● 20 నుంచి ఇంటింటి సర్వే చేపట్టండి ● కలెక్టర్ ఆనంద్



బ్రోచర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు

నెల్లూరు (వైద్యం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను కుష్టువ్యాధి రహితంగా మార్చేందుకు వైద్యాధికారులు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. బుధవారం కుష్టువ్యాధి నివారణకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే జరుగుతుందని చెప్పారు. ఈ సర్వేలో కుష్టుపై ప్రజలకు శాస్త్రీయ అవగాహన కల్పించాలని, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. ముందుగానే సర్వే బృందాలకు తగిన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రధానంగా ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో సర్వే పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. అనంతరం కుష్టు నివారణ బ్రోచర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, జడ్పీ సీఈవో విద్యారమ, మెప్మా పీడీ రాధమ్మ, ఐసీడీఎస్ పీడీ సుశీల, ఆశా కో ఆర్డినేటర్ మంజులమ్మ, డిప్యూటీ ఈవో లక్ష్మీ ప్రసన్న, డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొడుకే కాలయముడు!

● స్నానం చేయమన్నందుకు తల్లిదండ్రులపై కర్రతో దాడి
● తండ్రి మృతి.. తల్లి పరిస్థితి విషమం
● దామరమడుగు ఆర్‌ఆర్ నగర్‌లో ఘటన
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ



కుమారుడి దాడిలో గాయపడి మృతి చెందిన తండ్రి శ్రీనివాసులు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిదండ్రుల పాట కుమారుడే కాలయముడయ్యాడు. స్నానం చేయమ న్నందుకు కర్రతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన తండ్రి మృతి చెందగా తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని దామరమడుగు పంచాయతీ ఆర్‌ఆర్ నగర్ (మతంకాలనీ)లో జరిగింది. వివరాల మేరకు.. ఆర్‌ఆర్ నగర్‌లో గౌడ సమాజిక వర్గానికి చెందిన అంతటి శ్రీనివాసులు, సుబ్బమ్మ దంపతులు నివాసముంటున్నారు. వారి కుమారుడు ఏడుకొండలు గత కొన్నేళ్లుగా ఏ పనీ లేకుండా తిరుగుతున్నాడు. ఎప్పుడైనా ఒకసారి పూలు కోసే పనికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో అతనిని తల్లిదండ్రులే పోషిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పూలుకోసే పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రావడంతో. తల్లి స్నానం చేయమని చెప్పింది. దీనితో తల్లిదండ్రులతో గొడవపడి వారిని కర్రతో దాడి చేసి తలపై బలంగా కొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి అంతటి శ్రీనివాసులు(56) మృతి చెందగా తల్లి పరిస్థితి విషమంగా ఉంది. దాడికి పాల్పడిన కుమారుడు పరారయ్యాడు. సమాచారం అందుకున్న బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, సిబ్బందితో కలసి ఆర్‌ఆర్ నగర్‌లో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

● డీఎస్పీ పరిశీలన

ఈ విషయం తెలిసిన నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆర్‌ఆర్ నగర్‌లోని ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి నెల్లూరు పెద్దాసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న మృతుడు శ్రీనివాసులు భార్య సుబ్బమ్మను పరిశీలించారు. అయితే కేసు దర్యాప్తు విషయంలో జాప్యం ఎందుకైందని సీఐ, ఎస్‌ఐలపై డీఎస్పీ మండిపడ్డారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

పొదలకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు - నెల్లూరు రహదారిలో చాటగొట్ల సమీపంలోని బిరదవోలు - పార్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. అటుగా వెళ్తున్న ఓ కానిస్టేబుల్ గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ శాఖ నెల్లూరు రూరల్ రేంజర్ మాల్యాద్రి, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ అధికారులు అల్తాఫ్, మనోజ్‌కుమార్, సిబ్బంది మృతి చెందిన చుక్కల దుప్పిని పొదలకూరు పశువైద్యశాలకు తరలించారు. డాక్టర్ అరుణ పంచనామా నిర్వహించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి దుర్మరణం

కోవూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కావలి రైల్వే పోలీసుల కథనం మేరకు.. పడుగుపాడు రైల్వే స్టేషన్ దాటిన తరువాత నెల్లూరు మార్గంలో రైల్వే సుమారు 35 నుంచి 40 ఏళ్ల యువకుడు రైల్వే ట్రాకు దాటుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొంది. మృతుడి ముఖం గుర్తించేందుకు వీలు లేకుండా నలిగిపోయింది. మృతుడి వద్ద ఎలాంటి ఆచూకీ లభించలేదని రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. 5.6 అడుగుల ఎత్తు కలిగి, బ్లూ, పింకు రంగు గళ్ల ఫుల్ చొక్కా, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని సమాచారం తెలిసిన వారు 9848343638కు తెలియ చేయాలని ఆయన కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	240
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7460
వెండి కిలో ధర	రూ. 92,200
వెండి ఒక గ్రాము	రూ.95.20

రాయితీపై డ్రోన్లు



వరిపైరుపై రసాయనిక మందు పిచికారి చేస్తున్న డ్రోన్

● రైతు సంఘాలకు అందచేయనున్న అధికారులు
● కొత్తగా మరో 9 సంఘాల ఏర్పాటు
● ఇప్పటికే శిక్షణ పొందిన 31 మంది పైలెట్లు
● మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటాం.. సాగులో పెట్టుబడులు తగ్గించేందుకు, కూలీల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణను తీసుకువస్తున్నాం.. ఎరువులు, పురుగు మందులు చల్లేందుకు రాయితీపై డ్రోన్లు అందిస్తున్నాం... దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు యువతకు ఉపాధి దొరుకుతుంది'.. గత వైసీపీ పాలనలో సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పలికిన పలుకులు ఇవి. అయితే అవన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రోన్లపై ప్రత్యేక సమీక్షలు నిర్వహించి, రైతులకు 80శాతం రాయితీపై అందించేలా కార్యాచరణ రూపొందించింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు కూడా ప్రభుత్వం విడుదల చేసింది.

● సాగు ఖర్చులు తగ్గించేందుకు..

పంటల సాగులో రోజురోజుకు ఖర్చులు పెరుగుతున్నాయి. వీటిని తగ్గించేందుకు, కూలీల కొరతను అధిగమించేందుకు యాంత్రీకరణ ఎంతోముఖ్యం. ఈదిశగా రైతులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత వైసీపీ పాలనలో ఆర్‌బీకే పరిధిలో సంఘాలను ఏర్పాటు చేసి రాయితీపై డ్రోన్లను అందించాలని కార్యచరణ రూపొందించారు. అయినా అమలుకు నోచుకోలేదు. జిల్లాలోని 38 మండలాల్లో సుమారు 5లక్షల ఎకరాల్లో వరిసాగవుతోంది. జిల్లాలో సాగు పరిస్థితులను బట్టి 40 సంఘాలను ఏర్పాటు చేసి డ్రోన్లు అందించాలని భావించింది. ఈనేపథ్యంలో జిల్లాలో దాదాపు 31 సంఘాలను వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క రైతు సంఘం నుంచి ఒకరిని ఎంపిక చేసి పైలట్ శిక్షణ కూడా ఇచ్చారు. కాని డ్రోన్లు మాత్రం ఇవ్వలేదు.

● 40 కాదు 80 శాతం

గత వైసీపీ ప్రభుత్వం రైతు సంఘాలకు 40శాతం రాయితీపై డ్రోన్లు అందించాలని సంకల్పించింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం మాత్రం 80శాతం రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నది. డ్రోన్ యూనిట్ విలువ రూ.10లక్షలు. కాగా అందులో రైతు వాటా కింద రూ.5లక్షలు ముందుగా బ్యాంకు వారికి చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు నుంచి మరో రూ.5లక్షలు రుణం లభిస్తుంది. అనంతరం డ్రోన్‌ను రైతు సంఘాలను ఇస్తారు. ప్రభుత్వం అందించే రాయితీ రూ.8లక్షలు తరువాత రైతు గ్రూపుల ఖాతాలకు అందచేయనున్నారు.

● 30 శాతం పెట్టుబడి ఆదా..

డ్రోన్లతో పురుగు మందుల పిచికారి ఎంతో ఉపయోగం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పొలం మొత్తానికి పురుగు మందు సమానంగా పిచికారి జరుగుతుంది.దీంతో మందుల ఖర్చు సైతం దాదాపుగా 30శాతం ఆదా అవుతుందని అధికారుల అంచనా. పరిమిత సమయంలో మందు పిచికారి చేయవచ్చు.దీంతో రైతులకు శ్రమతో పాటు సమయం తగ్గుతుంది.

> **త్వరలో రానున్న డ్రోన్లు**
>
> 
>
> జిల్లాకు 40 డ్రోన్లు అందించే అవకాశం ఉంది. ఇప్పటికే 31 సంఘాలను ఏర్పాటు చేశాం. అందులో ఎంపిక చేసిన వారికి పైలెట్ శిక్షణ కూడా పూర్తయింది. ఇంకో 9 సంఘాలు ఏర్పాటు చేయాలి. వారికి కూడా శిక్షణ ఇవ్వాల్సి ఉంది.
>
> - పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

సోమశిలలో 71.363 టీఎంసీల నీరు

అనంతసాగరం జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 2,022 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 71.363 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2050, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రేపు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లులోని ఆల్తూరు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం మినగల్లు ప్రీమియం లీగ్-2025 జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుతి రూ.10,016, 2వ బహుమతి రూ.7,016, 3వ బహుమతి రూ.5,016, ప్రత్యేక బహుమతులు దాతల సహకారంతో అందజేస్తారని పేర్కొన్నారు. ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు రూ.500 టీం రుసుం చెల్లించాలని తెలిపారు. 8500553818, 8985990555 నెంబర్లకు టీం వివరాలు పంపించాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న తిరుమల నాయుడు

దాతల సొమ్మును వాడుకున్నారు

● రెడ్‌క్రాస్‌ను వైసీపీ కార్యాలయంగా మార్చారు
● తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు తిరుమల

నెల్లూరు (వైద్యం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సంస్థకు దాతలిచ్చిన విరాళాలను తన రాజకీయాలకు వాడుకున్న చరిత్ర ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిదని, ఆయన హయాంలో రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చేశారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు తిరుమల నాయుడు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి ఉండగా రూ.15 కోట్ల డిపాజిట్లకు రూ.30 కోట్లు ఓడీలు తీసుకుని సంస్థను అప్పుల పాలు చేశారని ఆరోపించారు. రెడ్‌క్రాస్ ఎన్నికల్లో మనోహర్‌రెడ్డి ప్యానెల్ గెలిస్తే అడ్డగోలుగా చంద్రశేఖర్ రెడ్డి చైర్మన్ అయ్యారన్నారు. సంస్థలో జనరల్ మేనేజర్ పదవి సృష్టించి తన అనుచరుడు భక్తవత్సలరెడ్డిని నియమించి నెలకు రూ.80వేల చొప్పున దాతల సొమ్ము దోచి పెట్టారన్నారు. రెడ్‌క్రాస్ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డీఈవోను ఎందుకు మార్చాల్సి వచ్చిందో చెప్పాలని నిలదీశారు. మంత్రి నారాయణ తనను ఇబ్బంది పెట్టారని, అందుకే రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్‌గా రాజీనామా చేస్తున్నట్లు చంద్రశేఖర్‌రెడ్డి చెప్పడం దారుణమన్నారు. రెండు పదవులకు సమయం కేటాయించలేమని చెబుతున్న చంద్రశేఖర్‌రెడ్డి మూడో పదవి ఎమ్మెల్సీకి ఎప్పుడు రాజీనామా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు లేకిన్‌రెడ్డి, ప్రవీణ్, మోపూరు సాయికిరణ్, గాదంశెట్టి హేమంత్, రఫీ, శివారెడ్డి, నాని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణ శివారు ప్రాంతంలోని గండిపాళెం మార్గంలో గల పెట్రోల్‌బంకు వద్ద మంగళవారం రాత్రి జరిగింది. వివరాల మేరకు.. సీతారామపురం మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి డేవిడ్ స్థానిక ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో వంటమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. పని ముగించుకొని స్వగ్రామానికి వెళుతుండగా పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డుకు అడ్డంగా గేదె రావడంతో తప్పించబోయి మోటార్ బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావ డంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

నిషేధిత యాంటీబయోటిక్స్ అమ్మితే కఠిన చర్యలు

● మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు ● ఆక్వా ఫీడ్ దుకాణానికి రూ.25వేల ఫైన్



రికార్డులను పరిశీలిస్తున్న జేడీ నాగేశ్వరరావు, పక్కన వివిధ శాఖల అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగుకు నిషేధిత యాంటీ బయోటిక్స్ అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు వ్యాపారు లను హెచ్చరించారు. అలాంటి యాంటీ బయోటిక్స్ వాడకం నివారణలో భాగంగా జిల్లా స్థాయి కమిటీ(డీఎల్‌సీ) చైర్మన్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, అప్పడా కో వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నెల్లూరులోని శ్రీరాజశేఖర్ ఆక్వా ఫీడ్స్ అండ్ కెమికల్స్ షాపును తనిఖీ చేశా రు. లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. మొదటి తప్పుగా భావించి రూ.25వేల అపరాధ రుసుము విధించినట్లు జేడీ తెలిపారు. ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతి ఉన్న ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని సూచించారు. ఈ తనిఖీల్లో మత్స్యశాఖ ఏడీ బాబు, నెల్లూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తి, మత్స్య అభివృద్ధి అధికారి సంజయ్ స్టీఫెన్, పడుగుపాడు మత్స్య అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, ఎంపెడా టెక్నికల్ అధికారి స్వదీప్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అత్యాధునిక శస్త్రచికిత్సలు



శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న బాలుడి వద్ద వైద్య నిపుణులు

నెల్లూరు (వైద్యం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు అత్యాధునిక శస్త్రచి కిత్సలను వైద్య నిపుణులు విజయ వంతంగా నిర్వ హించారు. ప్రాణా పాయ స్థితిలో ఉన్న నిరుపేదలైన ఇద్దరిని కాపాడారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ జయరాజ్ మాట్లాడుతూ నగరంలోని బాలాజీ నగర్‌కు చెందిన ఉదయగిరి పెంచలయ్య, రాములమ్మ కుమారుడు అరవింద్ (12)కు మూత్రనాళం మూసుకు పోయిందని, పలు ఆసుపత్రులకు వెళ్లినా ఫలితం లేకపోవడంతో జీజీహెచ్‌కు తీసుకువచ్చారని చెప్పారు. పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి యురిత్రోప్లాస్టీ వ్యాధిగా గుర్తించామని తెలిపారు. దీనిని నిర్లక్ష్యం చేస్తే మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారని తెలిపారు. ఈ క్రమంలో చెంపల లోపలి భాగంలో ఉన్న చర్మాన్ని తీసి మూత్రనాళానికి అతికించి (రీకనస్ట్రిట్) శస్త్రచికిత్స చేశామన్నారు. ప్రస్తుతం ఆ బాలుడు పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు.

● రాపూరు మండలం గోనుపల్లికి చెందిన కార్మికురాలు ఏలూరు పెంచలమ్మ (45)కు చేతి నరాలు చిట్లి చేయి బాగా వాచిపోయి రక్తం గడ్డ కట్టిందని వైద్య నిపుణులు తెలిపారు. దీనిని ఎన్యురిజమ్ లైగేషన్‌గా గుర్తించామన్నారు. బాధితురాలికి రెం డు కిడ్నీలు దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటోందని, గుండె కూడా 30 శాతమే కొట్టుకుంటోందని చెప్పారు. ఈ నేపథ్యంలో వెంటనే శస్త్రచికిత్స చేశామని, లేకపోతే గుండెకు సక్రమంగా రక్తం సరఫరా అందక బాధితురాలు మృతిచెందే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పెంచలమ్మ కోలుకుంటోందని వెల్లడించారు.

ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ శస్త్రచికిత్స లకు సహకరించిన మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాసరావు కు అభినందనలు తెలిపారు. జీజీహెచ్‌లో అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫిజీషియన్ డాక్టర్ గంగాధర్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

18 వరకు స్వీకరణ : నాగదేవి ప్రసాద్

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పేద బ్రాహ్మణ ఉన్నత విద్య సహాయక ట్రస్ట్ ద్వారా 2024-25వ సంవత్సరానికి విద్యా ఉపకారవేతనాలకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ నాగదేవి ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ (1, 2 సంవత్సరాలు), బీటెక్ (1, 2, 3), పీజీ విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తులు పంపాలని కోరారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఎస్‌వీఎల్ వరప్రసాద్‌రావు (98851 99663), వై నాగదేవిప్రసాద్ (94401 64423), బీ వెంకట సతీష్ (98664 46321)ను సంప్రదించాలని, దరఖాస్తులను వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు.

బైక్ మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తా : ఇంటూరి



బైక్ మెకానిక్‌ల అసోసియేషన్ సభ్యులతో ఎమ్మెల్యే ఇంటూరి, ఎంవీఐ రాంబాబు

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని బైక్ మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బైక్ మెకానిక్‌ల అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం బుధవారం సాయంత్రం పట్టణ ంలోని ఇస్లాంపేట షాదీఖానాలో జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీచేసే సమయంలో బైక్ మెకానిక్‌లకు కూడా న్యాయం చేయటం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంవీఐ రాంబాబు, కార్మికశాఖ అధికారి మేరీసుజాత, బైక్ మెకానిక్‌ల అసోసియేషన్ ప్రతినిధులు డి ధర్మా తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పాలీఫెస్ట్‌లో 'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఏపీ పాలీఫెస్ట్‌లో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించిన నేచురల్ అండ్ మల్టీపర్పస్ సస్టెనబుల్ కోల్డ్ స్టోరేజీ అనే ప్రాజెక్టు ప్రశంసలందుకుందని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రశంసలు, జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన విద్యార్థులను రాష్ట్ర ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు మార్గనిర్దేశం చేసిన డాక్టరు ఎం లక్ష్మణరావు, బీ సంపత్‌కుమార్‌ను, విద్యార్థులను ఆయన అభినందించారు.

రేపు ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు

● ఎమ్మెల్యే దగుమాటికి ఆహ్వానం



బిట్రగుంట: ముక్కోటి ఏకాదశికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆహ్వానిస్తున్న ఈవో రాధాకృష్ణ

బిట్రగుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు జరుగుఆయని ఆలయ ఈవో రాధాకృష్ణ బుధవారం తెలిపారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆలయ సాంప్రదాయ ప్రకారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, అర్చకులు సత్యనారాయణా చార్యులు తదితరులు ఉన్నారు. అలాగే సీఎల్ పురంలోని కోదండరామాలయం, బృందావనంలోని రామాలయాలో ముక్కోటి ఏకాదశి పూజలంటాయని నిర్వాహకులు తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఉదయగిరి, జనవరి 8 (ఆంధజ్యోతి): పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండలంలోని గడ్డంవారిపల్లి, కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, శివరామిరెడ్డి, ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో చేరని లబ్ధిదారులకు నోటీసులు



మద్దూరుపాడులోని టిడ్కో గృహాలు

కావలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్దూరుపాడులో ఉన్న టిడ్కో గృహాలలో ఇల్లు మంజూరై రిజిస్ట్రేషన్‌కు రాకుండా, బ్యాంకు మార్టిగేజ్ చేయని 639 మందికి నోటీసులు జారీ చేశారు. మొత్తం 2,112 టిడ్కో గృహాలను మూడు కేటగిరిలుగా విభజించారు. వాటిలో 300 చ.అ విస్తీర్ణం గృహాలు 693 లబ్ధిదారులకు కేటాయించగా వాటిలో 11 మాత్రం వివిధ కారణాల వలన ఖాళీగా ఉన్నాయి. 365 చ.అ గృహాలు 864 ఉండగా వాటిలో 391 మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేయగా 327 గృహాల లబ్ధిదారులు బ్యాంకు మార్టిగేజ్‌తో రుణాలకు అర్హత పొందారు. 430 చ.అ గృహాలు 544 ఉండగా వాటిలో 235కు రిజిస్ట్రేషన్ అవ్వగా 202 గృహాల లబ్ధిదారులు బ్యాంకు మార్టిగేజ్‌తో రుణాలకు అర్హతలు పొందారు. దీంతో వివిధ కారణాల వలన రిజిస్ట్రేషన్‌లు కానివి, బ్యాంకు మార్టిగేజ్ కాని వారిని గుర్తించి వారందరికీ నోటీస్‌లు ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. వయస్సు పైబడిన వారికి, సిబిల్ కోర్ తక్కువ ఉన్న వారికి బ్యాంకు రుణాలు ఇవ్వనందున కొందరు, స్థానికంగా లేకుండా పోయిన వారు కొందరు, చనిపోయిన వారు కొందరు ఉండటంతో అలాంటి వారందరి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు గృహాలు అందచేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వయస్సు పైబడిన వారు, సిబిల్ కోర్ తక్కువ ఉన్నవారు వారి కుటుంబంలో ఎవరైనా అర్హులు ఉంటే వారికి అవకాశాలు కల్పిస్తామని అధికారులు చెపుతున్నారు. అలా వీలు కాని వారికి వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా రుణం లేకుండా డబ్బులు చెల్లిస్తే వారికి గృహాలు అప్పచెప్పడం జరుగుతోందన్నారు. వీటన్నింటికి ఎవరూ ముందుకు రాకపోతే వారి గృహాలను రద్దు చేసి కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు అధికారులు చెపుతున్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పంటల బీమాను వినియోగించుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

అల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పంటల బీమాను ప్రతి రైతు వినియోగించుకొని విపత్తుల సమయంలో నష్టాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి అన్నారు. మండలం లోని సింగపేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏడీఏ నాగరాజు, లీడ్ బ్యాంక్ ఎల్‌డిఎం నర్సోజిరావు, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి దేవసేనమ్మ తెలిపారు. బుధవారం ఆమె ఏఎస్ పేట మండల వ్యవసాయ అధికారిణి రజనితో కలసి గుంపర్లపాడు, వేల్పులగుంట గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈవో చిరంజీవి, విఎఎలు పాల్గొన్నారు.

●సీతారామపురం: సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం మండల వ్యవసాయాధికారి పి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభలో రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

శిథిలావస్థలో తరగతి గదులు

● అద్దె భవనంలో అరకొర వసతులు

● విద్యార్థుల అవస్థలు



శిథిలమైన గండిపాళెంలోని పాఠశాల భవనం

ఉదయగిరి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది మండలంలోని గండిపాళెం గ్రామ ప్రాథమిక పాఠశాల దుస్థితి. అన్ని వసతులతో చూడముచ్చటగా ఉన్న ఆ పాఠశాల తరగతి గదులు మాత్రం కాలంచెల్లి శిథిలావస్థకు చేరుకున్నాయి. శ్లాబు పెచ్చు లూడుతూ తలుపులు, కిటికీలు సైతం అధ్వాన్నంగా మారి ఆ భవనం ఎప్పుడు కూలుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారడంతో చేసేదేమీ లేక గ్రామంలోని ఓ అద్దె నివాసంలోకి పాఠశాలను తరలించారు. కాగా, అద్దె భవనంలోకి పాఠశాలను తరలించినప్పటికీ అరకొర వసతుల నడుమ చదువులు సాగించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఇరుకైన చిన్నపాటి గదుల్లో విద్యాభ్యాసం సాగించడంతోపాటు బోధన చేయడం ఉపాధ్యాయులకు సైతం తలకుమించిన భారంగా మారుతోంది. మధ్యాహ్న భోజన నిర్వాహకుల పరిస్థితి సైతం అలాగే మారింది.

దాత సహకారం

విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా అద్దె భవనంలోకి పాఠశాలను తరలించినప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు అందే అవకాశం లేకపోవడంతో ఆ భారాన్ని తల్లిదండ్రులే భరాయించాల్సి వస్తుందని తెలిసి అయోమయానికి గురయ్యారు. తొలుత ప్రతి విద్యార్థి రూ.100 చొప్పున నెల అద్దె రూ.3 వేలు చెల్లించేందుకు నగదు జమచేశారు. దీంతో తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం పాఠశాలకు చేరుకొని ప్రతినెలా అద్దె నగదును తాను చెల్లిస్తానని హామీ ఇచ్చి జమ చేసిన నగదు తిరిగి తల్లిదండ్రులకు అందజేయాలని సూచించారు.

ఉన్నతాధికారులకు నివేదించాం: ప్రధానోపాధ్యాయురాలు

శిథిలావస్థకు చేరిన పాఠశాలతోపాటు అద్దె నివాసంలోని పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించామని ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌జీ షాహీదా తెలిపారు. కొంతమేర ఇబ్బందులు ఉన్నప్పటికీ వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నాం.

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



కలువాయి : నృత్యం చేస్తున్న విద్యార్థులు.

కలువాయి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వం ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యా ర్థుల నృత్యాలు, రైతులు, హరిదాసుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు భోగిపండ్లు పోశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●కావలిటౌన్: పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు చీరలు, విద్యార్థులు పంచెలు, లాల్చీలు ధరించి అలరించారు. కళాశాల ప్రాంగణంలో దిద్దిన ముగ్గులు ఏర్పాటు చేసిన బొమ్మరిల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో పాటు కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు టగ్‌ఆఫ్‌వార్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ శేషయ్య, అకడమిక్ ఇన్‌చార్జ్ ప్రత్యూషా రెడ్డి పాల్గొన్నారు.

● జేబీ డిగ్రీ కళాశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, లక్ష్మీ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని సంక్రాంతి పండుగ విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ వరకుమారి, పీడీ

ఆత్మకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌ఆర్‌జెడి కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ జి వరకుమారి, పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు, విశ్వవిద్యాలయం పరిశీలకులు డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్ క్రీడాపోటీలను ప్రారంభించారు. సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆత్మకూరు ఏఎస్‌ఆర్ కళాశాల జట్టుపై ఉదయగిరి ఎంఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు, ఆత్మకూరు ఎస్‌వి డిగ్రీ కళాశాల జట్టుపై ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. గురువారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని పీడీ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

ఉదయగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో గిఫ్ట్‌స్కీం విజేతలకు బుధవారం డిపో మేనేజరు శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి ఆదరణ పొందేందుకు ఉదయగిరి డిపో ఆధ్వర్యంలో ఉదయగిరి - సీతారామపురం మార్గంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు చేసే ప్రయాణికులు టిక్కెట్ ద్వారా స్కీమ్‌లో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. బస్సుల్లో ఏర్పాటుచేసిన గిఫ్ట్ బాక్సుల్లో ప్రయాణికులు వేసిన టిక్కెట్లను లక్కీడ్రా తీయగా వాణి, మహబూబ్‌బేగం విజేతలుగా ఎంపికయ్యారన్నారు. దీంతో వారికి బహుమతులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది పాల్గొన్నారు.

డీపీవోకు సన్మానం

వింజమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డిని బుధవారం జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ తరఫున డీపీవో కార్యాలయంలో వింజమూరు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఉద్యోగుల సమస్యలు డీపీవో దృష్టికి తీసుకువెళ్లారు. డీపీవోట సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఏపీఎన్జీవో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలి



బ్రహ్మేశ్వరంలో మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తదితరులు

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పథకాలకు సంబంధించిన వాటర్ ట్యాంకుల్లో ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చర్యలు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని డిప్యూటీ సీఈవో జే మోహన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామంలో గల సీపీడబ్ల్యూఎస్ మంచినీటి పథకాన్ని పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పైపులైన్‌ల లీకులను, మరమ్మతులను వెంటనే చేయించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, బ్రహ్మేశ్వరం సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు షేక్ నజీముల్లా, మల్లికార్జున, నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజమైన ఎస్సీలను గుర్తించి న్యాయం చేయాలి

అల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న తప్పిదాలను సవరించి నిజమైన ఎస్సీలను గుర్తించి వారికి న్యాయం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు కోరారు. బుధవారం అల్లూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శంభన్ కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చిన విషయం ఎవ్వరికీ తెలియజేయకుండా పంచాయతీ కార్యదర్శులు గోప్యంగా ఉంచారని, దీనిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టరు, అల్లూరు తహసీల్దారుకు విన్నవించారు. ఇప్పటి వరకు ఈ విషయంపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. వన్ మ్యాన్ కమిషన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ తప్పుడు నివేదికలను సిద్ధం చేస్తున్నారని, ఇటువంటివి కాకుండా నిజమైన ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమయంలో దానం మాల్యాద్రి, వేణుగోపాల్, ముసలి నరేంద్ర, పొంగులూరు సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

●డిప్యూటీ డీఎంహెచ్‌వో



డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టరు రజనిని సత్కరిస్తున్న వైద్యాధికారులు, వైద్యసిబ్బంది

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్యసేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టరు ఎస్ రజని సూచించారు. పదోన్నతిపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం పట్టణంలోని తూర్పు వడ్డెపాలెం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో డివిజన్ లోని వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆసు పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవ లను విధిగా అందించాలన్నారు. వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించడంతో పాటు అవకాశం ఉన్న మేర పీహెచ్‌సీ లోనే మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యాధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారులు రజనిని సత్కరించారు.

ఆన్‌లైన్ ద్వారా పెన్షనర్స్‌కు లైఫ్ సర్టిఫికెట్లు

కావలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ పెన్షనర్స్, ఫ్యామిలీ పెన్షనర్స్‌కు కావలి పెన్షనర్స్ భవనంలో ఆన్‌లైన్‌లో చేయిస్తున్న లైఫ్ సర్టిఫికెట్లను పెన్షనర్‌లు సద్వినియోగం చేసుకోవాలని కావలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ కావలి అధ్యక్షుడు ఆకుల రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 28 లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. పెన్షనర్స్ భవనం ద్వారా సమర్పించుకునే వారు ఆధార్‌కార్డు, దానికి అనుసంధానమైన ఫోన్‌ను, పీపీవో నంబరు, సీఎఫ్‌ఎంఎస్ ఐడీ నెంబరు, పెన్షన్ పొందు బ్యాంకు అకౌంట్ నంబరును తీసుకు రావాలన్నారు.

యువతకు స్వామి వివేకానంద ఆదర్శం



స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అపస్ నాయకులు

సంగం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని అడ్వకేట్ కాకు మురళిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నేతాజీ జూనియర్ కళాశాలలో అపస్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులకు స్వామి వివేకానంద జీవితంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అపస్ నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నేతాజీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మదార్ బాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమశిల అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

అనంతసాగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద చేస్తున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్రా రాజగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రాజెక్టు వద్ద అఫ్రాన్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పనులు వేగవంతం చేసేలా ప్రభుత్వం అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంగళి పుల్లయ్య, అన్వర్‌బాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యలో అగ్రగామిగా నిలపాలి

ఉదయగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యా శాఖకు సంబంధించి అన్ని విషయాల్లో ఉదయగిరి మండలాన్ని అగ్రగామిగా నిలపాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రాలను సందర్శించారు. పాఠశాలల్లో వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలోని పిల్లల మానసిక, శారీరక వికాసాలు బాగున్నాయని ఐఈఆర్టీలను అభినందించారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహా, శివనందిని, సుభాష్‌చంద్రబోస్, సీఆర్‌ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

● జి. ప్రసాద్‌బాబు, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త



ముఖాముఖి

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఆధునిక సాంకేతికత, యంత్ర పరికరాలు, నూతన వంగడాలు, నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కేవీకే హెడ్ డాక్టరు జీ ప్రసాద్‌బాబు తెలిపారు.

? కందుకూరు కేవీకేలో సిబ్బంది, శాస్త్రవేత్తలు తగినంతమంది ఉన్నారా.

! శాస్త్రవేత్తలు ఆరుగురు పనిచేస్తున్నారు. సిబ్బంది కొరత కొంత ఇబ్బందిగా ఉంది. అయినప్పటికీ సామూహిక ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు ద్వారా దిగుబడుల పెంపునకు కృషి చేస్తున్నాం.

? కేవీకే ద్వారా ఏ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు

! రైతులకు నూతన యంత్ర పరికరాలను, నూతన వంగడాలను పరిచయం చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ఆ వర్గాల రైతులకు చిన్నచిన్న పనిముట్లు, టార్పాలిన్లు, ప్లాస్టిక్ ట్రేలు, వానపాముల ఎరువుల తయారీకి ప్లాస్టిక్ పెట్టెలు ఉచితంగా అందజేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహకంలో భాగంగా కందుకూరు రైతుబజారులో ఔట్‌లెట్ ప్రారంభించాం.

? రైతులతో అనుసంధానం కోసం ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! సోషల్ మీడియాను ఉపయోగించుకుని తమ సందేశాలు రైతులకు అందేలా చూస్తున్నాం. కేవీకే ద్వారా ప్రారంభించిన కిసాన్ సారథి అనే వాట్సాప్ గ్రూప్‌లో కేవీకే పరిధిలో ఉన్న 28 మండలాల నుంచి 3వేల మంది రైతులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కందుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ విజయ్‌భాస్కర్, పి చంద్రయ్య, కార్యాలయ ఏఓ టి శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కొండాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను అరి కట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో పద్మజాకుమారి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం కిషోర బాలికల వికాస కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఎంఈవో-2 ఆనందరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌భాషా, వైద్యాధికారి నసీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, షకీలా, ఏపీఎం కాంతారావు, పాల్గొన్నారు.

బోగోలులో...

బిట్రగుంట : బోగోలు మండలం వెలుగు కార్యాలయంలో బుధవారం కావలి సీడీపీవో శారద అధ్యక్షతన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, ఎంఈవో జయమ్మ, అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఏపీవో శ్రీనివాసులు, అంగన్వాడీ సూపర్ వైజర్లు కోటేశ్వరి, సుభాషిణి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషిచేయాలి

కావలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డాక్టర్లు రమ్య, వెంకటేశ్వర్లు తెలిపారు. కావలి పట్టణం బాపూజీ నగర్‌లోని బాలికల వసతిగృహంలో బుధవారం జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సమస్యలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాల వలన కలుగు దుష్ఫలితాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారిణి నాగేశ్వ రమ్మ, జేవీవీ బాధ్యులు సీ. శారద, గాదిరెడ్డి హరినాథ్, సుబ్బరాయశర్మ, జానకిరాం, కల్యాణి, ఖాదర్‌బాషా, చలపతిరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై విచారణ

చేజర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ కోసం ప్రభు త్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు బుధవారం చేజర్ల మండలంలోని పలు గ్రామాలలో ప్రత్యేక వైద్య బృందాలు విచారణ చేపట్టారు. మంచానికే పరిమితమై రూ. 15 వేలు పింఛన్ తీసుకుంటున్న మొత్తం 25 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేపట్టారు. పూర్తి వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కావలిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నగర్‌లోని సంయుక్త సంస్థ కార్యాలయంలో బుధవారం అర్వపల్లి నాగరాజ సృజన దంపతుల కుమార్తె సులేఖ్య పుట్టిన రోజు పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా గుంతల్లేని రోడ్లు

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారులను ఈ నెలాఖరుకల్లా గుంతలు లేని రోడ్లుగా మారుస్తామని ఆ నియోజకవర్గ శాసన సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 22వడివిజన్ బీవీ నగర్‌లో రూ.1.20కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నామని, సహకరిస్తున్న కమిషనర్ సూర్యతేజకు ధన్యవాదాలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కంటే సాయిబాబా, స్థానిక కార్పొరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు యోగానందం, కోటిరెడ్డి, యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, కమిషనర్ సూర్యతేజ

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి

● నగర కమిషనర్ సూర్యతేజ ఆదేశం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 8(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ కోసం ఆయా స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం బీవీ నగర్ కేఎన్ఆర్ పాఠశాల రోడ్డు, లెప్రసీ ఆసుపత్రి రోడ్డు, మదర్ థెరిస్సా సచివాలయం పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. రోడ్లపై అతుకుల పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. డ్రైనేజీ కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు నిరంతరం జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి విద్యుత్ స్తంభానికి లైట్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ఎక్కువ వెలుగునిచ్చే హైమాక్స్ లైట్లు అమర్చాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల మస్టర్ తనిఖీ చేసి ఆప్రాన్‌లు అందించారు. స్థానిక బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

పేదలకు వస్త్రదానం

నెల్లూరు (వైద్యం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఇందిరాభవన్ ట్రస్ట్ సభ్యుడు బాలసుధాకర్ బుధవారం పేదలకు వస్త్రదానం చేశారు. నగరంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చి వద్ద ఈ కార్యక్రమం జరిగింది. బాలసుధాకర్ మాట్లాడుతూ నేదురుమల్లి ట్రస్ట్ ద్వారా వెంకటగిరి ప్రాంతంలో ఎందరో పేదలకు రామ్ కుమార్‌రెడ్డి సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాల్వేషన్ ఆర్మీ నెల్లూరు డివిజన్ కమాండర్ రూథర్ శామ్యూలు, మహిళా విభాగం అధ్యక్షురాలు స్వాతిక తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లకు మరమ్మత్తులు చేస్తున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొండదిబ్బ, అలంకార్ సెంటర్, రాజావారి వీధి, బ్రాహ్మణ వీధి, మూలస్థానేశ్వర ఆలయం ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

నేతాజీ పార్కు పరిశీలన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్టోన్‌హౌస్‌పేట ప్రాంతం మొత్తానికి పప్పులవీధిలో నేతాజీ పార్కు ఒక్కటే ఉందని, ఆ పార్కులో పూర్తి స్థాయిలో సౌకర్యాల కల్పన అంశాన్ని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళతామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. నేతాజీ పార్కును బుధవారం జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం మోపొద్దు

● బీజేపీ నేత రమేష్ వినతి

నెల్లూరు (జడ్పీ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై లేకుండా చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. నగరంలో బుధవారం ఏపీఈఆర్‌సీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన పాల్గొని అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల 2026వ సంవత్సరం వరకు రూ.43 వేల కోట్ల రుపాయలను ట్రూ అప్ చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలకు రూ.53 వేల కోట్ల రుపాయల మేర బకాయిలు రావలసి ఉందని, వాటి వసూళ్ల మీద దృష్టి పెట్టి ట్రూ అప్ చార్జీల భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీలిశెట్టి లక్ష్మణరావు, నరాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకుడు మిడతల రమేష్

వాతావరణంతో వర్రీ

నెల్లూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన చలి, తగ్గిన ఉష్ణోగ్రతలు, రికార్డు స్థాయిలో నమోదవుతున్న గాలిలోని తేమ వంటి ప్రతికూల వాతావరణం ఈ రబీ సీజన్‌లోని వరి పంటకు చేటు తెస్తోంది. నెల్లూరు రూరల్ మండలంలో ప్రస్తుతం నారేతలు పూర్తయి అక్కడక్కడ కలుపు తీస్తున్నారు. అయితే దాదాపుగా 95 శాతం విస్తీర్ణంలోని వరి పైర్లలో జింకు లోపం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతోపాటు అక్కడక్కడ తెల్ల తెగులు పంటలను ఆశిస్తుండటంతో వరి ప్రాథమిక దశలోనే జబ్బున పడింది. దీనిని అధిగమించకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● వరిపైరును పీడిస్తున్న జింకులోపం
● తెల్లతెగులుతో మొక్కల బలహీనత
● నియంత్రించకపోతే దిగుబడిపై ప్రభావం



● 25 వేల ఎకరాల్లో సాగు

నెల్లూరుకు తూర్పు, పడమర ప్రాంతాల్లో కనుపూరు కాలువ, జాఫర్ సాహెబ్, సర్వేపల్లి, కోడూరు, లేబూరు కాలువలతోపాటు చెరువుల కింద దాదాపుగా 25 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. రబీ సీజన్ కావడంతో రైతాంగమంతా తొలి ప్రాధాన్యంగా వరినే సాగు చేస్తున్నారు. నారేతలకు ముందు దుక్కిలో లోతట్టుగా పిండి వెయ్యకపోవడంతో ప్రస్తుతం వరిలో జింకులోపం కనిపిస్తోంది. నారేతలు పూర్తయిన 4-6 వారాల మధ్య పంట ఈ అనారోగ్య సమస్యను ఎక్కువగా చూపుతోంది. అన్నీ గ్రామాల్లో దాదాపుగా ఇదే పరిస్థితి ఉందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు గుర్తించారు. భాస్వరం వంటి ఎరువులను కూడా పైపాటులో వేయడం వల్ల మందులోని నియంత్రణ శక్తి లోతట్టుకు వెళ్లడంలేదని వారు కనుగొన్నారు. దీనిని వెంటనే అదుపులోకి తీసుకురాకపోతే పంటకు శక్తినిచ్చే యూరియా, డీఏపీలాంటి ఎరువులు ఎన్ని వేసినా ఉపయోగం ఉండదని, తద్వారా తుది దశలో దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూడాల్సి వస్తుందని భావిస్తున్నారు. వెంటనే ముడి, చలామిన్ జింకులను పిచికారీ చేయాలని సూచిస్తున్నారు.



పైరుకు మందు చల్లుతున్న కూలీలు (ఇన్‌సెట్) జింకులోపం ఉన్న వరి

● వెంటాడుతున్న తెల్లతెగులు

రాత్రిపూట ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకంటే తక్కువగా నమోదవుతున్నందున, గాలిలో తేమ కారణంగా తెల్లతెగులు వరిని ఆశిస్తోంది. దీని వల్ల పంట బలహీనపడుతుందని అధికారులు చెప్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇండాక్సికార్బ్ మందును ఎకరాకి 100 ఎంఎల్‌గానీ, అనుపేటను 3 ఎకరాలకు ఒక కేజీనిగానీ వాడాలని సూచిస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్నాము

- ఎస్వీ నాగమోహన్, వ్యవసాయ అధికారి నెల్లూరు

ప్రస్తుతం వరిలో జింకు లోపం ఎక్కువగా కనిపిస్తోంది. మరో పక్క తెల్లతెగులు పంటను ఆశిస్తోంది. ప్రాథమిక దశలోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకోకపోతే నష్టపోవాల్సి వస్తుంది. వీటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము.

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

నెల్లూరు(క్రైం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఆలయం వద్ద యనమల నాగయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు అక్కడికి చేరుకుని నాగయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 14 సీసాల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా వెంకటరెడ్డినగర్‌లో నీలిశెట్టి లక్ష్మణరావు స్థానికంగా పనిచేసే పారిశుధ్య కార్మికులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకుడు మిడతల రమేష్ పాల్గొని దాతను అభినందించారు.

ఫ్రెండ్స్‌వాకర్స్ కార్యవర్గం ప్రమాణం

నెల్లూరు(విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక తిరుపతి నాయుడు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు అతిథిగా హాజరయ్యారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా పనిచేస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ మున్ముందు మరిన్ని ఉత్తమ సేవలందించాలని కోరారు. అసోసియేషన్ ఉన్నతికి సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం అధ్యక్షుడిగా కిలారి శ్రీనివాసులు నాయుడు, కార్యదర్శిగా గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారిగా మాగంటి ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా తలపనేని హరిబాబు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ నాయకులు పీ శ్రీనివాసులురెడ్డి, ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, నాయకులు కిలారి తిరుపతి నాయుడు, వేలూరు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పేరుతో పేదల భూములు దోచేశారు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రీ సర్వే పేరుతో పేదల భూములు దోచేశారని, ఇప్పటి వరకు 40 రెవెన్యూ సదస్సులు పెట్టినా ఇంకా సమస్యలు వస్తూనే ఉన్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాము రైతుల భాగస్వామ్యంతో 130 పనులకు రూ. 10.75 కోట్లు ఖర్చు చేస్తే, మాజీ మంత్రి కాకాణి కేవలం ఐదు పనులకు రూ.30 కోట్లు ఖర్చు చేసినట్లు చూపి దోచుకున్నారన్నారు. మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో కాకాణి అండదండలతో తహసీల్దార్లు వీరవసంతరావు, స్వాతి అనేక భూ అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయ్యారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మరుపూరులో ట్యాక్స్ కట్టే ధనవంతులకు భూ పట్టాలు ఇచ్చారని, సూరాయపాలెం వైసీపీ నేతలు 36 ఎకరాల భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో గిరిజనులకు ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయించడంపై ప్రత్యేక దృష్టి పెట్టానన్నారు. పేదలకు న్యాయం జరుగుతున్న ఓర్వలేని ప్రేమ, జాలి, కరుణ లేని కాకాణిది అసలు ఏ రక్తమో! రక్త పరీక్ష చేయించాలన్నారు. ఈ ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల దినంలో ప్రజలు నుంచి వచ్చిన అర్జీలు అన్నిటిని త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో నాగ సంతోషి అనూష, తహసీల్దారు శివ బాలకృష్ణయ్య, ఎంపీడీవో నరసింహారావు, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కోదూరు పెంచలభాస్కర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, అనిల్‌కుమార్, బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, ఆదాల సుగుణమ్మ పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సోమిరెడ్డి

రేషన్ డీలర్‌పై విచారణ



సరుకులు పరిశీలిస్తున్న అధికారులు

మనుబోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మలపూడి రేషన్ డీలర్‌పై రెవెన్యూ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. రేషన్‌డీలర్ సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని, కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నాడని, ఏదైనా అడిగితే సమాధానం చెప్పడం లేదంటూ కొద్ది రోజుల క్రితం కొమ్మలపూడి గ్రామస్థులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య రేషన్ దుకాణంను తనిఖీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్ఐ అశ్వథ్ నారాయణ, వీఆర్వో గుణశేఖర్ దుకాణంకు వెళ్ళి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో పాటు డీలర్‌ను విచారించి నివేదికను తయారు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తహసీల్దార్ తెలిపారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవు

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తే అధికారులపై చర్యలు తప్పవని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పంచాయతీల వారీగా అధికారులతో సమీక్షించారు. ఆనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధి కారుల మధ్య సమన్వయం ఉంటేనే గ్రామీణాభివృద్ధి జరుగుతుందన్నారు. ఎరువుల పంపిణీలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. రహదారులపై గుంతలను పూడ్చటంలో సంబంధిత అధికారులు తీవ్ర జాప్యం చేయడం సరికాదని, సంక్రాంతిలోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్య లను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించకుండా బిల్లులు డ్రా చేసుకున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సమావేశంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్‌కుమారి, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పొన్నలూరు పురందర్‌రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సత్యవోలు సత్యంరెడ్డి, ఎస్.కె.రఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

11న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరమడుగులో శనివారం ఉదయం 10 గంటలకు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహం ఆవిష్కరించనున్నట్లు దామరమడుగు అంబేడ్కర్ యువజన సంఘం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

కామ్రేడ్ రోశయ్యకు ఘన నివాళి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత కామ్రేడ్ రోశయ్య 17వ వర్ధంతి సందర్భంగా బుధవారం బుచ్చిలోని జొన్నవాడ సెంటర్లో ఆయన స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ అధ్యక్షుడు పోతంశెట్టి శ్రీనివాసులు, నాయకులు, పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

వెంకటాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుపూరు, చవటపాళెం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వరి పంట సాగులో మెలకువలు, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సందాని, అబిద్, రైతులు పాల్గొన్నారు.

పెంచలకోనలో పలు వ్యాపారాలకు వేలంపాట

రాపూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన ఆలయంలో 2025-26 సంవత్సరానికి పలు వ్యాపారాల నిర్వహణకు బహిరంగ వేలంపాటలు బుధవారం నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. టెంకాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునే దుకు, ఆలయాలలో కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు, టోల్‌గేట్ రుసుము వసూలుకు, భక్తులు సమర్పించిన వస్త్రాలు సేకరించేందుకు, చెప్పులు భద్రపరిచేందుకు, పుష్పాలు విక్రయానికి వేలంపాటలు నిర్వహించారు. కాగా, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ.31,72,000 అత్యధికంగా ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో తెలిపారు.



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కిశోరి వికాసంపై శిక్షణ తరగతులు

తోటపల్లిగూడూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసంపై మండలస్థాయి శిక్షణ తరగతులు బుధవారం సంఘమిత్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి కే వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ కిశోరి వికాసం ముఖ్య ఉద్దేశం 11 నుంచి 18 ఏళ్ల బాలికలు అనుసరించాల్సిన విధానాలను గురించి వివరించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో కృష్ణారెడ్డి, సీడీపీవో రాజ్యలక్ష్మీ, ఏపీఎం విజయలక్ష్మీ, ఐసీపీఎస్ జోత్స్నా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలో బుధవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన, సీఐ సుబ్బారావు, సీడీపీవో విజయలక్ష్మీ, కసుమూరు, ఇస్కపాళెం వైద్యాధికారులు డాక్టర్ ప్రవల్లిక, ప్రమోద్, ఎంఈవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల అభివృద్ధి అధికారి

కంటేపల్లిలో పశువైద్య శిబిరం

వెంకటాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లిలో బుధవారం స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశుసంవర్థక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వెంకటాచలం పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, మండవ ఫౌండేషన్ పశువైద్యాధికారి డాక్టర్ వీ శ్రీనివాసులునాయుడులు పశువులకు, గేదేలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటేపల్లి సర్పంచ్ బోనుబోయిన సుగుణమ్మ, వెటర్నరి అసిస్టెంట్ పోతురాజు, మనోజ్, వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్, రమణయ్య, మణి తదితరులున్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ఇందుకూరుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం ప్రాథమిక పాఠశాలలో బుధవారం గ్రామీణ వస్త్రధారణలో ప్రాచీన కాలాన్ని తలపించేలా విద్యార్థినీ విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవి, తదితరులు పాల్గొన్నారు.

అదానీ కృష్ణపట్నం పోర్టుకు ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు

ముత్తుకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్‌కు ప్లాటినం కేటగిరీ కింద సేవా రంగంలో ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి 18వ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు 2024 దక్కింది. కోల్‌కత్తాలోని తాజ్ బెంగాల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అదానీ కృష్ణపట్నం పోర్టు హెడ్ డ్రై కార్గో ఆపరేషన్స్ విజయ్‌రాథోడ్ బృందం పాల్గొంది. పశ్చిమబెంగాల్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డాక్టర్ శశి పంజా, పర్యావరణ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి రోషిణి సేన్, పోర్టు ప్రతినిధులకు అవార్డు, మెమెంటో, ధ్రువీకరణ పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ బృందాన్ని అభినందించారు.



అవార్డు అందుకుంటున్న అదానీ పోర్టు ప్రతినిధులు

రక్షిత మంచినీటి పథకం పరిశీలన

రాపూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్రాంతిపల్లి వద్ద ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారి ఎం విద్యారమ బుధవారం పరిశీలించారు. పోకూరుపల్లి ఎస్టీ కాలనీకి కూడా ఈ స్కీం ద్వారా నీటిని ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. దానికి అయ్యే ఖర్చును మండల పరిషత్ నిధుల ద్వారా సమీకరించి పనులు చేయాల్సిందిగా ఆదేశించారు. వీరితోపాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం భవానీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్‌డబ్ల్యూఎస్ బి మోహన్‌రావు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు చిరుగుపాటి ప్రసన్న, ఎన్ ఆంజనేయులు, మాజీ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు చెన్ను భాస్కర్‌రెడ్డి, గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో విద్యారమ

మినగల్లు రోడ్డుకు మరమ్మతులు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు రోడ్డు దుస్థితి తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించడంతో బుధవారం నుంచి యుద్ధప్రాతిపదికన రోడ్డుపై గోతులు పూడ్చి మరమ్మతు పనులు చేపడుతున్నారు. సోమవారం మినగల్లు నుంచి సాల్మానుపురం వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూలు బస్సు ఆమార్గంలో బోల్తాకొట్టిన విషయం విదితమే. దీనితో స్పందించిన ఎమ్మెల్యే ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించడంతో మినగల్లు నుంచి సాల్మానుపురం వరకు రూ.7లక్షలతో మరమ్మతులు చేపడుతున్నట్టు ఆర్అండ్‌బీ ఏఈ నాగరాజు తెలిపారు.



మినగల్లు రోడ్డుకు చేపడుతున్న మరమ్మతులు

ఆగిన విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల తరలింపు

ఇందుకూరుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇందుకూరుపేట, గండవరం గ్రామాల్లో ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలను కోవూరు కార్యాలయంలో విలీనం చేయాలని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జోక్యంతో రద్దయింది. ఈ కార్యాలయాల విలీనం ఆపాలని ఆ ప్రాంత ప్రజానీకం కోవూరు ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కలిసి ఈ కార్యాలయాలు కోవూరుకు తరలిస్తే ఆ ప్రాంత రైతులు ఎదుర్కొనే సమస్యలను వివరించారు. ఆమె అభ్యర్థనకు స్పందించిన విద్యుత్ శాఖ మంత్రి కార్యాలయాల విలీనం ఆపాలని శాఖాపరమైన ఆదేశాలిచ్చారు. దీంతో ఇందుకూరుపేట, గండవరం ప్రాంతవాసులు విద్యుత్ బిల్లులు చెల్లించాలంటే కోవూరు వెళ్లాల్సిన అవసరం తప్పింది. దీనిపై ఆయా ప్రాంత నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే, మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.



ఏమిటిది స్వామీ!

భక్తుల ప్రాణాలు తీసిన ఆశ... ఆత్రుత

- ఆరుగురి దుర్మరణం
- మృతుల్లో ఐదుగురు మహిళలు
- స్విమ్స్, రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- రుయాలో నలుగురి పరిస్థితి ఆందోళనకరం
- ప్రాణాలు తీసిన బైరాగిపట్టెడ కేంద్రం



ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యే ఆరణి, కమిషనరు మౌర్య



రుయాస్పత్రి వద్ద టీటీడీ అదనపు ఈవో





వైకుంఠ ద్వార దర్శనంతో పుణ్యం దక్కుతుందనే ఆశ వారి ప్రాణాలు తీసింది. టీటీడీ చరిత్రలో ఎన్నడూ జరగని ఘోర సంఘటనకు దారి తీసింది. తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రం ఆరుగురి పాలిట మృత్యు ప్రాంగణమైంది. వీరిలో ఐదుగురు మహిళలు. మధ్యాహ్నానికే తిరుపతిలోని ఎనిమిది టోకెన్ల జారీ కేంద్రాల వద్దకు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచీ ఏపీ, తెలంగాణలలోని అనేక ప్రాంతాల నుంచీ అసంఖ్యాకంగా భక్తులు తరలివచ్చారు. నీళ్ళు, తిండి అని కూడా చూసుకోకుండా కేంద్రాల బయట ఎదురుచూశారు. గురువారం తెల్లవారుజామున ఐదింటికి టోకెన్ల జారీ అని ప్రకటించిన టీటీడీ రద్దీ పరిస్థితిని చూసి అర్ధరాత్రి పన్నెండింటి నుంచే టోకెన్లు జారీ చేయాలని భావించింది. తొమ్మిదింటి నుంచీ క్యూలైన్లలోకి భక్తులను అనుమతించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించడానికి పోటెత్తారు. బైరాగిపట్టెడ కేంద్రం పక్కనే పార్కులో వేచివున్న భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించడానికి గేటు వద్దకు తోసుకువచ్చారు. రాత్రి 8.50 గంటల సమయంలో మూసివున్న గేటును భక్తులు నెట్టుకుంటూ రావడంతో గేటు ఒక్కసారిగా తెరుచుకోవడంతో నియంత్రణ కోల్పోయారు. దీంతో తొక్కిసలాట జరిగింది. ఒకరినొకరు తొక్కుకుంటూ క్యూలైన్ల వైపు పరుగులు తీశారు. కిందపడిపోయిన భక్తుల ఆర్తనాదాలు, హాహాకారాలతో బైరాగిపట్టెడ హోరెత్తిపోయింది. ఈ కేంద్రం వద్ద భద్రతకు నియమించిన పోలీసు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఉప్పెనలా దూసుకొచ్చిన భక్తులను అదుపు చేయలేకపోయారు. తోపులాటలో ఊపిరాడక అనేక మంది మహిళలు అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఫోన్లు చేసి అంబులెన్సులు వచ్చేలోగా పోలీసు సిబ్బంది, స్థానికులు పడిపోయిన భక్తులకు సపర్యలు చేసే ప్రయత్నం చేశారు. కొందరికి సీపీఆర్ కూడా చేశారు. సరైన శిక్షణ లేకుండా సీపీఆర్ చేస్తున్న దృశ్యాల వీడియోలు వైరల్ అయ్యాయి. గాయపడినవారిని రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ మొదలు పెట్టే సమయానికే జరగరాని ఘోరం జరిగిపోయింది. ఆ తర్వాత యధా ప్రకారం బైరాగి పట్టెడ కేంద్రంలో కూడా టోకెన్ల జారీ కొనసాగింది. అర్ధరాత్రి 12 గంటల సమయానికి వైకుంఠ ఏకాదశి రోజుకు సంబంధించిన 38 వేల టోకెన్ల జారీ పూర్తయింది. 12.30 గంటల సమయానికి వైకుంఠ ద్వాదశికి సంబంధించిన టోకెన్లలో 4500 టోకెన్లు పంపిణీ చేశారు.

భక్తులు పెద్ద ఎత్తున రావడంతోనే..

వైకుంఠ ద్వార దర్శనానికి గురువారం ఉదయం 5గంటలకు జారీచేసే టోకన్ల కోసం భక్తులు పెద్ద ఎత్తున ఎగబడడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటన దురదృష్టకరం. మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. ఘటనకు సంబంధించి వివరాలను ఎస్పీ ద్వారా తెలుసుకున్నా. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులను పరామర్శించా, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించా.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి









రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మునిరెడ్డి (35), ఈశ్వరమ్మ (36), పార్వతి (52), ఎం.రజిని (40), నాగరాజు (46), శోభారాణి (37), సుబ్బాచారి (63), అంబలాప్ (40), సాంబశివ (69), సావిత్రమ్మ (65), లక్ష్మీదేవి (30), కళావతి (34), అప్పల కొండ (55), నరేంద్ర (40), జయభారతి (47), షాముల్ రాజు (45), ఆదిలక్ష్మి (62), సూర్యకమల (45), రాజేశ్వరి (52), ఎం.రత్నమ్మ (50), నూకారత్నమ్మ (50), మల్లయ్య (42), పెద్దిరాజు (52), రమణమ్మ (48), శ్రీరామప్ప (70), సునీత (44), గౌరి (40), విజయలక్ష్మి (40), క్రిష్ణమ్మ (60), సూర్య (37), రమాదేవి (52). వీరిలో నలుగురు పాలిట్రామాతో చికిత్స పొందుతున్నారు. వీళ్ల పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉంది. ప్రాణాపాయం లేదని వైద్యులు అంటున్నారు. రాత్రి రుయా వద్దకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చేరుకుని బాధితులతో మాట్లాడారు. కాగా, 1.25 గంటలకు బాధితులు, వారి బంధువులకు ఆస్పత్రుల వద్దకు టీటీడీ అన్నప్రసాదాలు పంపింది.

చికిత్స పొందుతున్న 34మంది

ఈ ఘటనలో మొత్తం 40 మంది గాయపడినట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వీరిలో రుయాస్పత్రికి 28మందిని తరలించగా నలుగురు మృతి చెందారని, స్విమ్స్‌కు 12 మంది తరలించగా ఇద్దరు మృతి చెందినట్టు చెప్పారు. బుధవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. మృతిచెందిన ఆరుగురులో ఐదుమంది మహిళలు ఉండగా ఒకరు మాత్రమే పురుషుడు అని చెప్పారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

రుయా, స్విమ్స్‌కు క్యూ కట్టిన అంబులెన్సులు

మృత్యువాత పడడంతో పాటు 20 మందికి పైగా అస్వస్థత, గాయాల పాలయ్యారు. చికిత్స నిమిత్తం ఎస్వీఆర్ రుయా, స్విమ్స్ ఆస్పత్రికి తరలించడంతో ఆస్పత్రిలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఒకదాని వెంట మరొకటి అంబులెన్స్‌లు ఆస్పత్రుల వద్దకు క్యూ కట్టడంతో భక్తుల బంధువులు, ఆస్పత్రి సిబ్బంది, మీడియా ప్రతినిధులు అంబులెన్స్ వైపు పరుగులు తీశారు. కాళ్లు విరిగి గాయపడ్డ భక్తుల ఆర్తనాదాలు కలిచివేశాయి. చికిత్సపొందుతున్నవారిని టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఆర్డీవో రామ్మోహన్‌లతో పాటు పోలీసు అధికారులు పరామర్శించి, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని వైద్యాధికారులను కోరారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో పాటు ఇతర రాజకీయ పార్టీ నాయకులు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





క్యూలైన్ వద్ద పిల్లల నిరీక్షణ... సంఘటన తర్వాత టోకెన్లు జారీ చేస్తున్న టీటీడీ సిబ్బంది

అంచనా వేయడంలో అధికారుల విఫలం

తిరుపతిలో ఏర్పాటుచేసిన కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలుకోల్పోవడం బాధాకరం. టోకెన్‌ల జారీచేసే ముందు రోజు నుంచే భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడం, అంచనా వేయడంలో అధికారులు విఫలం చెందడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుంది. ఏర్పాట్లు బాగా చేసినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతుల కుటుంబాలకు బీజేపీ తీవ్ర సంతాపం ప్రకటిస్తోంది.

- సామంచి శ్రీనివాస్, బీజేపీ అధికార ప్రతినిధి



చిల్లకూరు, తడ పోలీసులచే
వంద కిలోల గంజాయి పట్టివేత

- మాజీ హోంగార్డుతో పాటు ఆరుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- మూడు కార్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు చోట్ల 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ రూ25 లక్షలు ఉంటుందని అంచనా. చిల్లకూరు పోలీసులు 72 కిలోలు, నలుగురు నిందితులను.. తడ పోలీసులు 28 కిలోల గంజాయి, ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం..



సీజ్ చేసిన 100 కిలోల గంజాయిని మీడియాకు చూపుతున్న ఎస్పీ

- పుత్తూరుకు చెందిన మాజీ హోంగార్డు పసుపులేటి గిరిబాబు, తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన మదన్‌కుమార్, గుమ్మిడిపూడికి చెందిన పంజనాధన్, మునసుందరం కొంతకాలంగా కాకినాడ జిల్లా తుని నుంచి గంజాయి తీసుకొచ్చి పుత్తూరు, తమిళనాడు ప్రాంతాల్లో విక్రయించేవారు. గతంలో గిరిబాబుపై కేసు నమోదైంది. తాజాగా వీరు తుని నుంచి కారులో దాదాపు 72 కిలోల గంజాయి తీసుకొస్తున్నారనే ముందస్తు సమాచారం అందింది. దీంతో గూడూరు డీఎస్పీ రమణకుమర్, అతడి బృందం మంగళవారం రాత్రి చిల్లకూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కడివేడు గ్రామం, కోట క్రాస్ రోడ్డు వద్ద వేచి ఉన్నారు. అతి వేగంగా ముందు పైలట్ చేస్తున్న మాజీ హోంగార్డు గిరిబాబు కారు వస్తుండగా వెనుక గంజాయి తీసుకొస్తున్న మరో కారు పోలీసులను చూసి తప్పించుకుని పోవడానికి ప్రయత్నించారు. కారులో వెళ్లిపోతుండగా పోలీసులు చేజ్ చేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో పోలీసు కారును సైతం ఢీకొట్టే ప్రయత్నం చేశారు. చివరకు రెండు కార్లు, దాదాపు 72 కిలోల గంజాయి స్వాధీనం పోలీసులు చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మళ్లీ వారిని కస్టడీకి తీసుకుని విచారించనున్నట్లు ఎస్పీ చెప్పారు.

తడ పరిధిలో...

తమిళనాడు రాష్ట్రం గుమ్మడిపూడికి చెందిన కె.షారూఖాన్, అదే ప్రాంతం సామిరెడ్డి కండ్రిగకు చెందిన జి. అరుణ్ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడేవారు. ఈ క్రమంలో ముందుగా అందిన సమాచారం మేరకు తడ సర్కిల్ పరిధిలోని శ్రీసిటీ వద్ద పోలీసులు కాపుకాచారు. వీరు కారులో చెన్నైకు గంజాయి తరలించడానికి వస్తుండగా చేజ్ చేసి పట్టుకున్నారు. వీరి నుంచి 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, షారూఖాన్, అరుణ్‌ను అరెస్టు చేశారు.

శెహభాష్ డీఎస్పీ, సీఐలు

ఆరుగురు గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలోప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. గూడూరు డీఎస్పీ రమణకుమార్, సీఐ కిషోర్‌బాబు, చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బందిని.. తడ ఘటనలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్పనాయుడు, సిబ్బంది ఉన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం

- భక్తులు ఆందోళన పడవద్దని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి పిలుపు
- కొత్త వైరస్ ప్రచారం నేపథ్యంలో మాస్కులతో రావాలని సూచన



'తిరుమల ఆలయంలో పదిరోజుల పాటు వైకుంఠద్వారాలు తెరిచే ఉంటాయి. కంగారు పడాల్సిన అవసరం లేదు. ప్రశాతంగా టోకెన్లు పొందండి. వైకుంఠద్వార దర్శనాలు చేసుకోండి' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచించారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను బుధవారం ఆయన తిరుమలలోని అన్నమయ్య భవనంలో మీడియాకు వివరించారు. 3 వేల మంది పోలీసులు, 1,500 వందల మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రత కల్పిస్తామన్నారు. ఇక, వైకుంఠద్వార దర్శన రోజుల్లో టోకెన్లు లేని భక్తులకు దర్శనాలు ఉండవని మరోసారి స్పష్టం చేశారు. కాగా కొత్త వైరస్ వస్తోందనే ప్రచారం జరుగుతున్న క్రమంలో భక్తులు మాస్కులు ధరించి అన్ని జాగ్రత్తలతో తిరుమలకు రావాలని టీటీడీ చైర్మన్ కోరారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీధర్‌బాబు





బెల్లంకొండ సురేష్ - గౌతమ్ సింఘానియా

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, సినీనిర్మాత బెల్లంకొండ సురేష్, రేమాండ్ సంస్థ అధినేత గౌతమ్ సింఘానియా, మాజీ ఎంపీ చింతా మోహన్ ఉన్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.20 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,566

తలనీలాలు సమర్పించినవారు: 16,021

సంక్రాంతికి కూ..చుక్..చుక్

- తిరుపతి- హైదరాబాదుల మధ్య ప్రత్యేక రైళ్ళు



తిరుపతి(సెంట్రల్), జనవరి8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి దక్షిణ మధ్య రైల్వే తిరుపతి- హైదరాబాదు మధ్య సంక్రాంతి ప్రత్యేక రైళ్ళను నడుపనున్నట్లు ఆ రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. హైదరాబాదు కేంద్రంగా పలుప్రాంతాలకు ప్రత్యేక రైళ్ళు నడుపుతున్నామని తెలిపారు.

- చర్లపల్లినుంచి తిరుపతికి ప్రత్యేక రైలు (02764) బుధవారం సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాదు, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా మరుసటి రోజు ఉదయం 7.15 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.
- తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(02763) గురువారం సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటిరోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లికి చేరుకొంటుంది.
- ప్రత్యేక రైలు ఈ నెల 11,15 తేదీల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి, 9,12,16 తేదీల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి రాకపోకలు నిర్వహిస్తాయి.
- కాచిగూడలో మరో ప్రత్యేక రైలు(07655) ఈ నెల 9వ తేది సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి మల్కాజ్‌గిరి, చర్లపల్లి జనగాం, ఖాజీపేట, వరంగల్, మహబుబ బాదు, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.
- ఈ ప్రత్యేక రైలు 10వ తేది రాత్రి 8.05 గంటలకు బయలు దేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు కాచిగూడకు చేరుకొంటుది.
- ప్రత్యేక రైలు ఈ నెల 16న కాచిగూడ నుంచి తిరుపతికి, 10, 17 తేదీల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి రాకపోకలు నిర్వహిస్తాయి.

యూనివర్సిటీ వీసీల నియామకానికి

సెర్చ్ కమిటీల ఏర్పాటు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీ వీసీల నియామక సెర్చ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం బుధవారం జారీ చేసింది. ఎస్వీయూ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా రాయ్‌పూర్ ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ రాంకుమార్ కాకాని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మాజీ వీసీ వీఎస్ రావు, యూజీసీ నామినీగా అహ్మదాబాదులోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అమి యు. ఉపాధ్యాయను నియమించారు. పద్మావతి వర్సిటీ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ నిరుపమ రాణి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా హైదరాబాదు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, యూజీసీ నామినీగా మధ్యప్రదేశ్‌కు చెందిన హరిసింగ్ గౌర్ వర్సిటీ వీససీ ప్రొఫెసర్ నీలిమ గుప్తాను నియమించారు. ● ద్రవిడ వర్సిటీ సెర్చ్ కమిటీలో.. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా గౌహతికి నైపర్ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ యుఎస్ఎన్ మూర్తి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.నరసింహారావు, యూజీసీ నామినీగా ఢిల్లీకి చెందిన లివర్ అండ్ బిలియరీ సైన్స్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌కె సరిన్‌ను నియమించారు. ఆయా వర్సిటీల వీసీల నియామకానికి ఇప్పటికే నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తులూ స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి ముగ్గురి పేర్లను ఈ సెర్చ్ కమిటీలు గవర్నర్‌కు సిఫారసు చేయనున్నాయి.

ప్రధాని నోట..

శ్రీసిటీ ప్రగతి మాట

శ్రీసిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రధాని మోదీ ప్రశంసించారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నం బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... శ్రీసిటీ పారిశ్రామిక నగరం వల్ల ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రస్తావించారు. పారిశ్రామికంగా దేశంలోనే అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడం తమ లక్ష్యం అన్నారు. ఇప్పటికే శ్రీసిటీ రూపంలో ఏపీ తయారీ రంగం ఊపందుకుందని వివరించారు. కేంద్ర పీఎల్ఐ, ఇతర పథకాలు వినియోగించుకుని మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. మేక్ ఇన్ ఇండియా చొరవకు ప్రతిబింబంగా అంతర్జాతీయ కీర్తి గడించి, సుస్థిర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న శ్రీసిటీకి ప్రధాని కితాబు దక్కడం అభినందనీయం.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోండి

- నివేదికను కోర్టు ముందుంచండి
- తిరుపతి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలంటూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. పెళ్లకూరు మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ నన్నం ప్రిస్కిల్లా మరొకరు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపులు, వాటికి మద్యం సరఫరా చేస్తున్న మద్యం షాపు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అనధికారికంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. పిటిషనర్లు ఇచ్చిన వినతులపై స్పందించలేదన్నారు.

పొగ మంచుతో పలు విమానాలు ఆలస్యం

రేణిగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా తిరుపతి విమానాశ్రయంలో పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. బుధవారం ఉదయం హైదరాబాదు, ముంబై, ఢిల్లీ నుంచి నడుస్తున్న స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ అలయన్స్ విమానాలు దట్టమైన పొగమంచు కారణంగా 25 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి.

- 16 సవర్లు రికవరీ చేసిన పోలీసులు

ఒంటరి వృద్ధురాలిపై దాడిచేసి

బంగారు నగలు దోచుకెళ్లిన మహిళ అరెస్ట్



నిందితురాలు వల్లెమ్మ అరెస్టును చూపుతున్న పోలీసులు

నారాయణవనం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధురాలిపై దాడిచేసి బంగారు నగలు దోచుకెళ్లిన మహిళను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నారాయణవనం నవసందులో ఓసూరమ్మ(89) అనే వృద్ధురాలు ఒంటరిగా కాపురం ఉంటున్నారు. అదే వీధిలో టిఫిన్ అంగడి నడుపుకుని జీవనం సాగిస్తున్న ఎం.వల్లెమ్మ వృద్ధురాలు ఓసూరమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలపై కన్నేసింది. ఈ నేపథ్యంలో వృద్ధురాలితో అప్పడప్పుడు మాటామంతీ కలిపి పరిచయం పెంచుకుంది. ఈ నెల 5వ తేది ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ఓసూరమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన వల్లెమ్మ వృద్ధురాలు దగ్గరికెళ్లి మాటలు కలిపి, దాడి చేసింది. దీంతో అపస్మారక స్థితిలో పడిపోయిన ఓసూరమ్మ శరీరంపై ఉన్న 16 సవర్ల చైన్, ముక్కు, కమ్మలను దొంగలించుకుని వెళ్లిపోయింది. వృద్ధురాలి చెల్లి కుమారుడు అయ్యప్పన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న వల్లెమ్మ గురించి వాకబు చేయగా, కైలాసకోనలో ఉన్నట్లు గుర్తించి ఆమెను విచారించారు. విచారణలో ఆమె వృద్ధురాలిపై దాడి చేసి, 16 సవర్ల బంగారు నగలు దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆమెను అరెస్టు చేసి, బంగారు నగలను రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును రెండు రోజుల్లో ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు తదితర ప్రాజెక్టుల భూసేకరణ, నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కడప-రేణిగుంట, తిరుపతి-మదనపల్లె, రేణిగుంట-నాయుడుపేట ఆరులేన్ల పనులను వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నడికుడి-శ్రీకాళహస్తి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణలో ఇబ్బందులు లేకుండా ఆర్డీవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి-పాకాల రైల్వేట్రాక్ డబుల్ లైన్‌కు సంబంధించిన భూసేకరణ పనుల్లో పురోగతి ఉండాలని ఆదేశాలిచ్చారు. జేసీ శుభం బన్సల్‌తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీటీడీకి 'పర్యావరణ హిత' సంస్థల ఝలక్

- మూడేళ్లుగా అద్దె చెల్లించకుండానే లడ్డూ కవర్ల విక్రయాలు
- ఇటీవల కౌంటర్లు స్వాధీనం చేసుకున్న టీటీడీ

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత కవర్ల విక్రయ సంస్థలు టీటీడీకి ఝలక్ ఇచ్చాయి. దాదాపు మూడేళ్ల పాటు టీటీడీకి ఎలాంటి అద్దెను చెల్లించకుండా లడ్డూ కవర్ల విక్రయాలు నిర్వహిస్తున్న క్రమంలో టీటీడీ ఇటీవల కౌంటర్లను మూసివేసి, స్వాధీనం చేసుకుంది. తిరుమలలో పర్యావరణ పరిరక్షణ కోసం టీటీడీ నాలుగేళ్ల కిందట ప్లాస్టిక్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. తొలత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను నిషేధించిన టీటీడీ తర్వాత ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఉండకూదనే నిబంధనను పెట్టింది. భక్తులు లడ్డూల కోసం వినియోగించే కవర్లను కూడా నిషేధించింది. ఇందులో భాగంగానే స్వీట్స్ తీసుకెళ్లేందుకు వినియోగించే పేపర్ బ్యాక్స్‌లను, తర్వాత క్లాత్ బ్యాగులను, పేపర్ బ్యాగులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇవి లడ్డూలకు ఉండే నెయ్యిని పీల్చేస్తుండటం, ధర అధికంగా ఉండటంతో భక్తులు వీటిపై ఆసక్తి చూపలేదు. కొంతకాలం తర్వాత బయో డిగ్రేడబుల్ కవర్లు తెరపైకి వచ్చాయి. తొలుత 2021 ఫిబ్రవరిలో గ్రీన్ మంత్ర కవర్లు, అదే ఏడాది ఆగస్టులో డీఆర్డీవో సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కవర్లతో మరో సంస్థ ద్వారా బయో డిగ్రేడబుల్ కవర్ల విక్రయాలు మొదలయ్యాయి. అయితే వీరు కొన్నేళ్లుగా అద్దె చెల్లించని నేపథ్యంలో ఇటీవల టీటీడీ అధికారులు లడ్డూకౌంటర్‌లో వారి విక్రయాల కోసం కేటాయించిన కౌంటర్లను మూసివేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరి నుంచి ఎంత అద్దె రావాలి, వారిపై టీటీడీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియాల్సి ఉంది.



విరాళాన్ని అందజేస్తున్న దాత

అన్నప్రసాదంకు 50 వేల అమెరికన్ డాలర్ల విరాళం

తిరుమల, జనవరి8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం 50 వేల అమెరికన్ డాలర్లు విరాళంగా అందాయి. అమెరికాలోని చికాగోకు చెందిన ఎన్ఆర్ఐ భక్తుడు పెరంబదూర్ కందల శ్రీనివాసాచార్య ఈవిరాళాన్ని అందజేశారు. డాలర్లను బుధవారం రాత్రి టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడికి దాత అందజేశారు.

రెవెన్యూ సదస్సులకు 149 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోంది. బుధవారం జిల్లా వ్యాప్తంగా 34 మండలాల పరిధిలో 24గ్రామ సభలు నిర్వహించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 149 అర్జీలు అందాయన్నారు. వీటిల్లో.. ఇంటి స్థలాలకు 8, అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 11, రీసర్వేపై 9, ఆర్‌వోఆర్‌పై 81, ఇతర విషయాలకు భూసమస్యలపై 35 వచ్చాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజునుంచి ఇప్పటి వరకు 16,459 అర్జీలు అందాయన్నారు.

మున్సిపల్ కమిషనర్ల సీనియారిటీ జాబితా

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

మోదీకి బ్రహ్మారథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

విద్యార్థులే మన దేశ భవిష్యత్తు

- ప్రతిభా పురస్కారాల ప్రదాన సభలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువతే మన దేశ భవిష్యత్తు అని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో బుధవారం ఏపీ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. కష్టాలకు ఎదురీది చదువుకున్నవారే ప్రపంచంలో అత్యద్భుత శక్తులుగా రూపొందారని గుర్తుచేశారు. పాఠ్య పుస్తకాలతోపాటు సమాజం గురించి చదువుకోవాలని సూచించారు. సాంకేతికతను సరిగా వినియోగించుకుంటూ.. పొగ, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం వంటి మహోన్నత మూర్తుల గొప్పదనాన్ని తెలుసుకోవాలని అన్నారు. ఎంత ఎదిగినా నైతిక మార్గాన్ని విడనాడకూడదని కోరారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ.. ఇంటర్ నుంచి పీజీ దాకా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ఇచ్చామన్నారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు మదన్, టీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ అన్నా అనిత, ఎస్వీయూ కామర్స్ హెడ్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తిరుపతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలన్నారు. సుమారు 250 మందికి అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్, వర్సిటీ అధ్యక్షుడు ఉపేంద్ర, నాయకులు శ్రీను, నగర అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రతిభా అవార్డు అందజేస్తున్న ప్రదానం చేస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

వైష్ణవి డెయిరీ మూత

వీధిన పడ్డ కార్మికులు ● పాడి రైతుల ఇక్కట్లు



పెళ్లకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఒడిదుడుగులు లేకుండా సాఫీగా సాగిపోతున్న వైష్ణవి డెయిరీ అకస్మాత్తుగా మూతపడింది. దీంతో అటు కార్మికులు, ఉద్యోగులు ఉపాధి కోల్పోయి వీధిన పడగా పాడి రైతులు సైతం తిప్పలు పడుతున్నారు. మండలంలోని పునబాక గ్రామంలో 21.5 ఎకరాల విస్తీర్ణంలో 2009 శ్రీవైష్ణవి డెయిరీకి శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని 2011లో ఉత్పత్తి ప్రారంభించారు. సుమారు 100 మందికి ఉపాధి లభించడంతో పాటు చుట్టుపక్కల 15 గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పాల సేకరణ జరిగేది. ఇదిలా ఉండగా గత వైసీపీ ప్రభుత్వంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలకు సరఫరా చేసే నెయ్యిలో కల్తీ జరిగిందన్న వార్తలు కలకలం రేపాయి. వైష్ణవి డెయిరీ నుంచి నెయ్యి కల్తీ సరఫరా చేసినట్లు తెలియడంతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. ఇందుకోసం నియమించిన సిట్ అధికారులు పలు దఫాలు వైష్ణవి డెయిరీలో తనిఖీలు నిర్వహించారు. దీంతో ఆందోళనకు గురైన డెయిరీ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా గత నెల 15న పరిశ్రమను మూసివేసింది. ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా కంపెనీ మూసివేయడంతో తమకు రావాల్సిన గ్రాట్యుటీతో పాటు ఇతర అలెవెన్స్‌లు ఇవ్వాలని నెల్లూరు కార్మికశాఖ కమిషనర్‌ను కార్మికులు కలిసి విన్నవించారు.

దొంతు వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే నివాళి



వెంకటేశ్వర్లు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పులికొల్లు రాజేశ్వరరావు

వెంకటగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి దొంతు వెంటేశ్వర్లు(70)కు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఏఎంసీ మాజీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాథ నాయుడు, వల్లభనేని మధు నాయుడు, సీసీ నాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధరం, నాయకులు సామల లక్ష్మీపతి, అవ్వారు సత్యనారాయణ, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పప్పు చంద్రమౌళిరెడ్డి, రావి మస్తాన్ నాయుడు, రావి సత్యం నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, ఆరికట్ల శ్రీరాములు నాయుడు, చైతన్య, జనసేన నాయకులు జంపాల ప్రకాష్ తదితరులు వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళులర్పించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గెలుపొందిన జట్టుతో ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

గూడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ కళాశాల క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఒత్తిడిని అధిగమించి చదువుల్లో ఏకాగ్రతను సాధిస్తారన్నారు. విజేతగా నిలిచిన స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రన్నర్‌గా నిలిచిన సూళ్లూరుపేటకు చెందిన ఎస్వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణరాజు, అమ్మాజీ, రవీంద్రబాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నేరవేర్చాలి

చిల్లకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన నేరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద హామీలను నేరవేర్చాలని కోరుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రభాకర్, శశికుమార్, కాలేషా, జమాలుల్లా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 203 అర్జీలు

పెళ్లకూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు బుధవారం నాటితో ముగిశాయి. పెళ్లకూరు మండలంలోని డిసెంబరు 6నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం కాగా, బుధవారం కానూరులో నిర్వహించారు. మొత్తం 203 అర్జీలు అందగా, అందులో 64 వినతులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషీబాయి, టీడీపీ మండల అధక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి సిస్టమ్ ఆయకట్టు కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు వెంపళ్ల వెంకటేశ్వర్లు, మాడుపూరు మురళీనాయుడు, నెలవల ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాల దగ్ధం

నాయుడుపేట టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాలపురంలో ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. రాజగోపాలపురంలో నివాసం ఉంటున్న గురవయ్య కుటుంబ సభ్యులతో కలసి బుధవారం సాయంత్రం ఇంట్లో ఉండగా వాషింగ్ మిషన్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో కుటుంబసభ్యులు కేకలు వేస్తూ బయటకు పరుగులుతీశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేశారు. విద్యుత్‌శాఖ సిబ్బంది సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంటు

- నిర్వహణ లేక ఆగిన ఉత్పత్తి
- విద్యుత్ కనెన్షన్ కూడా ఇవ్వని వైనం
- హెచ్‌ఎంపీవీ వైరస్ నేపథ్యంలో ప్రజల ఆందోళన



ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

గూడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోగులకు ఆక్సిజన్ కొరత లేకుండా ఉండేందుకు స్థానిక ఏరియా ఆస్పత్రిలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంటు నిరుపయోగంగా ఉంది. కొవిడ్ సమయంలో ఆక్సిజన్ కొరత కారణంగా ఎంతో మంది ఇబ్బందులు పడడంతో పాటు ప్రాణాలను సైతం కోల్పోయారు. అప్పట్లో పలువురు దాతలు ముందుకు వచ్చి స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులు పడకుండా ఆక్సిజన్ సిలిండర్లను వితరణగా అందజేశారు. అయితే కొవిడ్ తీవ్రంగా ఉండడంతో ఆక్సిజన్ కొరత వల్ల రోగులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ఆక్సిజన్ కొరతను నివారించేందుకు ఏరియా ఆస్పత్రిలో 2021 డిసెంబరు 31న ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంటును లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేశారు. అయితే రెండు నెలలు కూడా సక్రమంగా ప్లాంటును వినియోగించకపోవడంతో అది కాస్త నిరుపయోగంగా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆక్సిజన్ ప్లాంటు నేడు శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు తీవ్రమైన ఆయాశం, ఉబ్బసం వంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కొత్తగా హ్యూమన్ మెటాన్యూమో (హెచ్‌ఎంపీవీ) వైరస్ చైనా నుంచి మన దేశంలోని ప్రవేశించిందని, ఇప్పటికే దేశవ్యాప్తంగా 5 కేసులు నమోదయ్యాయన్న వార్తలు ప్రజల్లో గుబులు రేపుతున్నాయి. ప్రధానంగా ఈ వైరస్ వల్ల శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయని వైద్యనిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి ఆక్సిజన్ ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.





ప్రభుత్వాస్పత్రిలో జ్వర బాధితులు - ఒకే బెడ్‌పై నలుగురు చిన్నారులు

వణికిస్తున్న జ్వరాలు

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

సూళ్లూరుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో పడమటి పల్లెలు విషజ్వరాలతో మంచం పడుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం లోపించి దోమలు విజృంభిస్తుండంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. మండలంలోని దామానెల్లూరు, మంగళంపాడు, మంగానెల్లూరు, సుగ్గుపల్లి, ఉగ్గుముడి, ఎన్‌వీకండ్రిగ గ్రామాల్లో ఇంటింటా జ్వరపీడితులు ఉన్నారు. ఉన్నట్టుండి కాళ్లు, చేతులు పట్టేయడం, తీవ్ర జ్వరం రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గరు జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. జ్వరపీడితుల్లో చిన్నపిల్లలు అధికంగా ఉండటం గమనార్హం. దామానెల్లూరు, మంగానెల్లూరు గ్రామాల్లో ఊరంతా జ్వరాలతో బాధపడుతున్నారు. గత మూడు రోజుల నుంచి ఈ గ్రామాల్లో పిల్లలు కూడా తీవ్ర జలుబు, దగ్గు, జ్వరంతో ప్రభుత్వాస్పత్రికి వెళుతున్నారు. గత మూడు రోజులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. సోమవారం ఓపీ 310, మంగళవారం 360, బుధవారం 255 నమోదవగా ఇందులో 80 శాతానికి పైగా జ్వర బాధితులు ఉన్నారు. బుధవారం మంగానెల్లూరు, దామానెల్లూరు నుంచి దాదాపు 30 మందికి పైగా చిన్న పిల్లలు వైద్యం కోసం వచ్చారు. ఆస్పత్రిలో బెడ్‌లు సరిపోకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురికి వైద్యం చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

ఆర్‌ఆర్ ట్రేడర్స్ నిర్వాహకుడిపై కేసు

కోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో ఉన్న ఆర్‌ఆర్ ట్రేడర్స్ అండ్ ఆర్డర్స్ సప్లయ్స్ యజమాని రాజారామాయన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. సగం ధరలకే ఫర్నిచర్ ఇస్తామని పలు ఆఫర్లు పెట్టి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఆర్‌ఆర్ ట్రేడర్స్ బోర్డు తిప్పేసిన సంగతి తెలిసిందే. ఆ సంస్థలో డబ్బులు పెట్టిన బాధితులంతా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌ఆర్ ట్రేడర్స్ యజమాని రాజారామాయన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతుడికి పోస్టుమార్టం

చిట్టమూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టమూరు రొయ్యల కాలువ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చెట్టును కారు ఢీకొన్న ప్రమాదంలో భరత్ కుమార్ గాంధీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాయుడుపేట మండలం బిరదవాడ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, వెంకటేష్, మహేష్‌ను మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన

వెంకటగిరిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఉదయం 10గంటలకు వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు కేవీకే శాస్త్రవేత్త విజయశ్రీ తెలిపారు. రైతులు పాల్గొని వ్యవసాయంలో డ్రోన్లు ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సూళ్లూరుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'నాకు ప్రాణపదమైన వస్తువులు, విషయాలు' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్రహ్మణ్యం శాస్త్రీ, జీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాదులకు బాటలు వేసుకోండి

కోట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో ఆయా పొదుపు సంఘాలు జీవనోపాదులకు బాటలు వేసుకోవాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ మురళి అన్నారు. మండల పరిధిలోని తిమ్మానాయుడుపాళెంలో బుధవారం 29 సంఘ బంధాలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పొదుపు సంఘాల బలోపేతానికి విరివిగా రుణాలు ఇవ్వనుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ పొదుపు బాటలో నడవాలన్నారు. సమావేశంలో సీసీ ప్రసాద్, వీవోఏలు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సంక్రాంతి సంబరాలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

కోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, విభాగాధిపతులు ప్రొఫెసర్ ఇందుమతి, డాక్టర్ వల్లిదేవి, డాక్టర్ వాసవీ, డాక్టర్ శారద, రాఘవమ్మతో పాటు కోఆర్డినేటర్ రాజేష్, శ్రీనివాసులు, మేనేజర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

వెంకటగిరి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం 11గంటలకు జరుగుతుందని ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనాధ్ బుధవారం తెలిపారు.

కార్యకర్తలకే పెద్దపీట

జడ్పీటీసీ, ఎంపీపీల సమావేశంలో జగన్

నెల్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'ఇప్పటివరకు జరిగింది మరచిపోండి, భవిష్యత్తులో అన్నీ విషయాల్లోనూ కార్యకర్తలకే పెద్దపీట వేస్తా'... అని వైసీపీ అధినేత జగన్ జిల్లా ద్వితీయశ్రేణి నాయకులకు భరోసా ఇచ్చారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగింది మరిచిపోండి, ఇక భవిష్యత్తులో అన్నీ విషయాల్లోనూ కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. మిమ్మల్ని ఇబ్బందులు పెట్టినవారి పేర్లు రాసిపెట్టుకోండి, మనం మళ్లీ అధికారంలోకి వచ్చాక వారి చేత మీకు సెల్యూట్ కొట్టిస్తాను.. అని జగన్ అన్నారు. రాజకీయ పదవుల్లో కానీ, అభివృద్ధి పనుల విషయంలో కానీ కార్యకర్తలకే అగ్రతాంబూలమని తెలిపారు. సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ మేరిగ మురళి, మాజీ ఎమ్మెల్యేలు అనీల్ కుమార్ యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఉదయగిరి, వెంకటగిరి ఇన్‌చార్జులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ఏటి పండుగ



ఏటి పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, కమిషనర్ ఫజులుల్లా తదితరులు

నాయుడుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా ఏటి పండుగ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం కమిషనర్ ఫజులుల్లాతో కలిసి ఎమ్మెల్యే ఏటి పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో ఏటి పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కుల మతాలకు అతీతంగా జరుపుకునే ఏటి పండుగను విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్, గంగాప్రసాద్, దార్ల రాజేంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి



సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న డిప్యూటీ ఈవో సనత్‌కుమార్

గూడూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలను చేపట్టి దేశాభివృద్ధిలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో నవకోటి నాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధూ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జయలక్ష్మి

వెంకటగిరి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా అడుగులు ముందుకు వేయాలని మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళాశాలల్లో కిశోర బాలిక వికాశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, టీఎస్ క్లస్టర్ ఇన్‌ఛార్జి జయసింగ్, లక్ష్మీభవానీ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసంతో సమాజాభివృద్ధి

వాకాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల వికాసంతో సమాజాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ మహిళా పోలీసులు, హెల్త్ సెక్రటరీలకు కిశోర బాలికల వికాసంపై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆత్మరక్షణ, డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్‌లపై పిల్లలకు అవగాహన కల్పించాలరు. కార్యక్రమంలో సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ బుజ్జమ్మ, ఎంఈవో నసీం ఆలీ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు సత్కారం



ఓజిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల వైసీపీ కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలిశారు. మండలంలో పార్టీ పరిస్థితిని వివరించారు. మాజీ సీఎంను శాలువాతో సత్కరించారు.

సిమెంట్ రోడ్డుకు భూమిపూజ



సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో వేణు

కోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం పంచాయతీ సిద్ధమ్మ కండ్రిగ బీసీ కాలనీలో బుధవారం రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు ఎంపీడీవో వేణు భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు చాపల శ్రీనివాసులు, చిట్టేటి నాగూరయ్య, భూపతి, వేణు, కసుమూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన రాంకుమార్ రెడ్డి



వెంకటగిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. నియోజకవర్గంలోని పలు అంశాలపై ఆయనకు వివరించారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో

తృటిలో తప్పిన ప్రమాదం

కోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ బాలభారతీ సెంటర్‌లో బుధవారం రాత్రి ఆటో డివైడర్‌ను ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. టీపీ గూడూరు మండలం పెదపట్టపుపాళెం గ్రామానికి చెందిన మత్స్యకార మహిళలు వాకాడు మండలం వైట్‌కుప్పంలో జరిగే ఓ శుభకార్యానికి ఆటో వెళ్తుండగా బాలభారతీ సమీపంలో డివైడర్‌ను ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఆటో ముందుభాగం దెబ్బతినగా, అందులో ప్రయాణిస్తున్న మహిళలకు ఎలాంటి గాయాలు తగలలేదు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు, స్వీట్లు ఎంఈవో శీనయ్య చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం, ప్రధానోపాధ్యాయుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాచవరం, ముమ్మాయపాళెంలో రెవెన్యూ సదస్సులు

ఓజిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మాచవరం, ముమ్మాయపాళెం గ్రామాల్లో బుధవారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు తమ భూములకు హద్దులు చూపాలని, పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని అర్జీలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్ఐ విజయకుమార్, వీఆర్వో తిరుపాలు, టీడీపీ నాయకులు కిరణ్, శంకు మహేంద్ర, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.